మానేరు
# జనత®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

6.3.2026 శుక్రవారం Friday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 316 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## టీ20 వరల్డ్ కప్ ఫైనల్ చేరిన భారత్...



7

సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శ్రేయోభిలాషులు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



# తగ్గేదే లేదంటున్న ఇరాన్

**ఇజ్రాయిల్, అమెరికాలకు దీటుగా జవాబు**

**మిస్సైళ్లు, డ్రోన్‌లతో విరుచుకు పడుతున్న ఇరాన్**

**చైనా సహకారంతోనే అంటూ.. అంతర్జాతీయ కథనాలు**

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ ఇటీవల దీటుగా బదులిస్తోంది. దాడుల్లో ఎక్కడా తగ్గడం లేదు. తమ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి అనంతరం మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ భీకర దాడులు చేపట్టింది. భారీ ఆయుధాలతో విరుచుకుపడుతూ పశ్చిమాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓవైపు ఇరాన్ వద్ద ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

04



## అమెరికా మరో దుస్సాహసం

అణు వార్‌హెడ్ క్షిపణి పరీక్ష

## ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు మోడీ ఫోన్

యుద్ధంపై దౌత్యానికి పిలుపు



## తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

తెలంగాణలో 14 నుంచి, ఎపిలో 16 నుంచి పరీక్షలు

వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం

.. వివరాలు 2లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

కడియం విచారణ పూర్తి... దానం విచారణ 7కు వాయిదా

.. వివరాలు 2లో

# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

**మురుగు శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ**

**కాంగ్రెస్‌ది విధ్వంస పాలన**

**నాగోల్ సమీపంలో మూసీని పరిశీలించిన కేటీఆర్ బృందం**

మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆర్‌ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కు లేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్‌ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు.





## ముగిసిన రాజ్యసభ నామినేషన్లు

**కాంగ్రెస్ నుంచి ఇద్దరు, ఒక ఇండిపెండెంట్ పోటీ**

**పదిమంది ఎమ్మెల్యేల సంతకాలు చేయించని ఇండిపెండెంట్**

**జనతా న్యూస్, హైదరాబాద్ :** రాజ్యసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. నామినేషన్లు ముగ్గురు వేసినా, ఇండిపెండెంట్‌గా వేసిన సాయి అనే వ్యక్తి నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉంది. పదిమంది ఎమ్మెల్యేల సంతకాలు చేయాల్సి ఉన్నా, అతను కేవలం నామినేషన్

మిగతా 2 లో



**ఘనంగా భట్టి తనయుడి వివాహం**

ముఖ్యమంత్రి రేవంత్ తదితర ప్రముఖుల హాజరు

# రాజ్యసభకు నితీశ్ నామినేషన్



**హాజరైన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా**

**బీహార్‌తో అనుబంధం కొనసాగుతుందని వెల్లడి**

**బిజెపికి దక్కనున్న కొత్త ముఖ్యమంత్రి పదవి**

4

బీహార్ సీఎం నితీశ్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేపర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు.



02

## కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశ్యం లేదు

**హైకోర్టుకు వివరించిన తెలంగాణ ప్రభుత్వం**

**అవతకవకలు, డబ్బు దుర్వినియోగంపైనే దృష్టి**

**తదుపరి విచారణ 12కు వాయిదా వేసిన కోర్టు**

## బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా

4

రాజకీయ ఒత్తిళ్లు కారణమై ఉండొచ్చన్న మమత

# లిక్కర్ కేసు కొట్టేయడంతో స్వామికి మొక్కు


03

**తిరుమలకు కాలినడకన చేరుకున్న కవిత**

**త్వరలోనే రాజకీయ పార్టీ ఏర్పాటు**

**తెలంగాణ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళతామని ప్రకటన**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకునేందుకు తిరుపతి చేరుకున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద నుంచి కాలినడకన తిరుమల బయల్దేరిన ఆమె.. ముందుగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు..

# నేటి నుంచి 99 రోజుల ప్రజాపాలన

## ప్రత్యేక లోగో ఆవిష్కరించిన ప్రభుత్వం




**హైదరాబాద్,మార్చి5 :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లోగోను ప్రభుత్వం ఆవిష్కరించింది. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగనున్నారు. మార్చి 6 నుంచి ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుజిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక నిర్వహణపై జిల్లా కలెక్టర్లకు ఇటీవలే సిఎం నిర్దేశం చేశారు.మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన..ప్రగతి ప్రణాళిక అయిదు దశల్లో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమ నిర్వహణపై ఉమ్మడి జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్చార్జి మంత్రితో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసి, ఈ సమావేశానికి జిల్లాలోని ప్రముఖ ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. ఈనెల 12 వ తేదీన ఆయా జిల్లాల్లో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు , సర్పంచులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని అన్నారు. ఇందుకుగాను పంచాయితీ రాజ్, మున్సిపల్ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తాయని అన్నారు. ఈ 99 రోజుల ప్రజా పాలన.. ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గ్రామ, మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించడం జరుగుతుందని మరోసారి తెలిపారు. దీనికి సంబంధించి ఎప్పటికప్పుడు తగు మార్గ దర్శకాలను జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

# 8నుంచి విమెన్ హాకీ కప్ టోర్నమెంట్

## అన్ని ఏర్పాట్లు చేసినట్లు మంత్రి వెల్లడి




**హైదరాబాద్,మార్చి5 :** ఈ నెల 8 నుండి గచ్చిబౌలి హాకీ స్టేడియం లో నిర్వహిస్తున్న ఉమెన్ వరల్డ్ హాకీ కప్ -2026 క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట క్రీడా, యువజన సర్వీసులు, పశు సంవర్ధక, మత్స్య శాఖా మంత్రివర్యులు వాకిటి శ్రీహరి వెల్లడించారు. రాష్ట్ర క్రీడా సాధికార సంస్థ చైర్మన్ కె శివ సేనా రెడ్డి, సోని బాల మాయాదేవి, ఇతర క్రీడాధికారులు పాల్గొన్నారు. గ్లోబల్ సిటీగా గుర్తింపు పొందుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. హాకి లో దేశానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన ధ్యాన్ చంద్ స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఫెడరేషన్ ఇంటర్నేషనల్ హాకీ వరల్డ్ క్వాలి÷ వుమెన్ హాకీ టోర్నమెంట్ 2026 నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసాము.మార్చి 8 నుంచి 14 వరకు జరిగే ఈ పోటీలు గచ్చిబౌలిలోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో జరగనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు ఆస్ట్రియా, ఇంగ్లాండ్, ఇటలీ, కొరియా, స్కాట్లాండ్, ఉరుగ్వే,వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ జట్లు ఇప్పటికే హైదరాబాద్ చేరుకుని, గచ్చిబౌలి లో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఆస్ట్రో టర్ఫ్ మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్నాయి. మహిళల వరల్డ్ కప్ హాకీ క్వాలి÷యైర్స్ 2026 కి ఈ పోటీలు కీలకంగామారనున్నాయి. టోర్నమెంట్‌ను లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని సదుపాయాలను సమకూర్చింది. క్రీడాకారుడు అయిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో గచ్చిబౌలి నందు అంతర్జాతీయ ప్రమాణాలతో ఆస్ట్రోటర్ఫ్ మైదానం, హై సెక్యూరిటీ, ఆధునిక సదు-పాయాలు, క్రీడాకారులకు అత్యుత్తమ వసతి ఏర్పాట్లు చేయబడ్డాయి.ఇప్పటికే ఈ టోర్నమెంట్లో పాల్గొనబోతున్న అన్ని జట్లు హైదరాబాద్‌కు చేరుకున్నాయి. తెలంగాణ ప్రభుత్వ క్రీడా శాఖ ఘనంగా స్వాగత సత్కారాలు చేసింది. దానితోపాటు ప్రాక్టీస్‌కు కావలసిన అన్ని వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల వసతి సదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగింది. అన్ని జట్ల క్రీడాకారిణిలు ఆధునికరించిన గచ్చిబౌలి ఆస్ట్రోటర్ఫ్ స్టేడియంలో బ్రహ్మాండంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రతినిధులు, క్రీడాకారుల కోసం నగరంలోని వారసత్వ ప్రదేశాల పర్యటనలు, వినోద కార్యక్రమాల రూపకల్పన కూడా చేపట్టాలని భావిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అందిస్తున్న ప్రోత్సాహం వల్లే ఇలాంటి అంతర్జాతీయ టోర్నమెంట్లను విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని గర్వంగా చెప్పగలుగుతున్నాము.రెండేళ్లలోనే తెలంగాణ క్రీడా శాఖ గణనీయమైన అభివృద్ధి దిశగా ముందుకెళ్తోంది. గచ్చిబౌలి లో జరిగే హాకీ పోటీలకు మీరంతా ప్రతి దినం హాజరై ఈ కార్యక్రమానికి విస్తృతంగా ప్రచారం కల్పించాల్సిందిగా కోరుతున్నట్లు మంత్రి వెల్లడించారు.

# తెలుగు రాష్ట్రాల్లో టెన్త్ పరీక్షలకు రెడీ

## తెలంగాణలో 14 నుంచి, ఎపిలో 16 నుంచి పరీక్షలు

## వాట్సాప్ ద్వారా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్‌కు అవకాశం

**హైదరాబాద్,మార్చి5 :** తెలుగు రాష్టాల్లో్ర పదో తరగతి పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మార్చి14 నుంచి.. ఏపీలో16 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ పరీక్షలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో ఆయా రాష్టాల్ర ఎస్ఎస్‌సీ బోర్డులు పరీక్షల హాల్‌టికెట్లను గురువారం విడుదల చేశాయి. వివిధ విభాగాలకు చెందిన విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లలో వేర్వేరుగా అందుబాటులో అధికారులు ఉంచారు. తెలంగాణలో విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ , ఏపీ విద్యార్థులు వాట్సాప్‌లో హాల్ టికెట్లు పొందవచ్చు. ఇక ఏపీ విద్యార్థులు మనమిత్ర (వాట్సాప్ నంబర్ 9552300009) లేదా లీప్ యాప్ ద్వారా.. అలాగే తెలంగాణ విద్యార్థులు వాట్సప్ నంబర్ (8096958096) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అలా కుదరకుంటే.. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద నుంచి కూడా ఈ పరీక్ష హాల్ టికెట్లను విద్యార్థులు పొందవచ్చు. తెలంగాణ అభ్యర్థులు 8096958096 వాట్సప్ నంబర్‌కు హాయ్ అని సందేశం చేయగానే మీ ఫోన్‌కి వెల్‌కమ్‌టూ మీ సేవ అని వస్తుంది. చాట్‌లో టైప్ చేసి మెసేజ్ చేయండి. మీ మొబైల్‌కు ఒక లింక్ వస్తుంది. ఆ లింక్‌ను ఓపెన్ చేసి జిల్లా, పాఠశాల పేరును ఎంచుకోండి. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ నమోదు చేస్తే హాల్‌టికెట్ మీ ఫోన్‌లోనే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోండి. ఏపీలో వాట్సప్‌లో డౌన్‌లోడ్ ఇలా.. మీ ఫోన్‌లో 552300009 నంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపాలి. సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది. ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి. అక్కడ ఎస్ఎస్సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోవాలి. అప్లికేషన్ నంబర్/ చైల్డ్ ఐడీతోపాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి. రెగ్యులర్/ప్రైవేట్/ ఓఎస్ఎస్‌సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయాలి. ఆ తర్వాత కొన్ని నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వస్తుంది. ఈ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి భద్రపరుచుకోవాలని సూచించారు.

# ముగిసిన రాజ్యసభ నామినేషన్లు

మొదటి పేజీ తరువాయి

వేశారు. దీంతో స్క్రూటినీలో చెల్లుబాటు కాదు. ఈ కారణంగా ఇద్దరి ఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ పార్టీ తరపున తెలంగాణ నుంచి రాజ్యసభ సభ్యులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు నామినేషన్

పత్రాలు సమర్పించారు. సింఘ్వీ.. మూడు సెట్‌ల నామినేషన్లు దాఖలు చేయగా.. వేం నరేందర్ రెడ్డి నాలుగు సెట్‌లు, ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి.. ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలతోపాటు ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థి సాయి నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఈ నామినేషన్లను ఎన్నికల అధికారి పరిశీలించనున్నారు. ఎమ్మెల్యేల సంతకాలు లేని ఇండిపెండెంట్ అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించనున్నారు. దాంతో అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ అభ్యర్థులు నిలవనున్నారు. వీరి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బరిలో నిలపలేదు. గతంలో తెలంగాణ నుంచి రాజ్యసభకు వెళ్లిన అభిషేక్ మను సింఘ్వీ పదవి కాలం మరికొద్ది రోజుల్లో ముగియనుంది. ఆయనకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మరోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించింది. ఇక తెలంగాణ నుంచి మరో రాజ్యసభ స్థానానికి తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీలోని సీనియర్లు, సూపర్ సీనియర్లు దాదాపు 16 మంది పోటీ పడ్డారు. ఆ జాబితాలోని ఎవరికి ఈ రాజ్యసభ స్థానం దక్కుతుందంటూ తీవ్ర ఉత్కంఠ సైతం నెలకొంది. అందుకోసం బుధవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. పార్టీ అగ్రనేతలతో వరుస భేటీలు అయ్యారు. చివరకు తన సన్నిహితుడు వేం నరేందర్ రెడ్డి పేరు ఖరారు చేయించుకున్నారు.



## రాజ్యసభ అభ్యర్థులుగా సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి

తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌తో పాలు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పెద్ద ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. తెలంగాణ తరపున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నట్లు అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. పస్తుతం సిటింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ పేరును కాంగ్రెస్ ఎంపిక చేయగా ఆయన బుధవారం సాయంత్రమే హైదరాబాద్ వచ్చారు. రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై రాత్రి వరకు చర్చలు, సంప్రదింపుల తర్వాత వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. ఈయనకు రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గట్టిగా కోరడం, అందరితో సన్నిహిత సంబంధాలుండే నరేందర్‌రెడ్డి పేరుపై ఎవరి నుంచీ అభ్యంతరాలు వ్యక్తం కాకపోవడంతో అధిష్ఠానం కూడా చివరకు సీఎం మాటకే ప్రాధాన్యం ఇచ్చింది. ఒకవేళ బీఆర్ఎస్ తన అభ్యర్థిని రంగంలోకి దింపితే రెండో స్థానానికి పోటీ అనివార్యమవుతుంది. ఆ పార్టీ పోటీలో లేకుంటే రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకుంటుంది. మొదటి స్థానానికి అభిషేక్ సింఘ్వీ ఎన్నికకు ఎలాంటి సమస్య లేదు. రెండో స్థానానికి అవసరమైన మెజార్టీ కాంగ్రెస్‌కు లేదు. ఎంఐఎంపై ఆధారపడాల్సి ఉంటుంది. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతుంది. అయితే ఎంఐఎం కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపింది.

# ఘనంగా భట్టి తనయుడి వివాహం

## ముఖ్యమంత్రి రేవంత్ తదితర ప్రముఖుల హాజరు

హైదరాబాద్,మార్చి5 : ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం వైభవంగా జరిగింది. శంషాబాద్ లో జరిగిన వివాహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారిని అభినందించారు. గవర్నర్ విష్ణుదేవ్ వర్మ, నటుడు చిరంజీవి తదితర ప్రముఖులు కూడా వివాహ వేడుకకు హాజరయ్యారు. పలువురు మంత్రులు, మాజీమంత్రులు కూడా హాజరయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కూడా సూర్య విక్రమాదిత్య వివాహానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్టాల్ర నుంచి పలువురు రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు. బంధుమిత్రుల సమక్షంలో భారీ జనసందోహం మధ్య వీరి వివాహం ఘనంగా జరిగింది.



# కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో దురుద్దేశ్యం లేదు

## హైకోర్టుకు వివరించిన తెలంగాణ ప్రభుత్వం

## అవతకవకలు, డబ్బు దుర్వినియోగంపైనే దృష్టి .. తదుపరి విచారణ 12కు వాయిదా

**హైదరాబాద్,మార్చి 5 :** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కమిషన్ ఏర్పాటు వెనుక ఎలాంటి దురుద్దేశం లేదని రాష్ట్ర ప్రభుత్వం అడ్వకేట్ జనరల్ ఎ. సుదర్శన్ రెడ్డి హైకోర్టుకు స్పష్టం చేశారు. ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో ప్రజాధనం దుర్వినియోగమైందని తెలిపారు. ఎవరినో టార్గెట్ చేసేందుకు జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్ ఏర్పాటు చేయలేదని హైకోర్టు దృష్టికి తీసుకు వెళ్లారు. గురువారం కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఏర్పాటు.. అందించిన నివేదికపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.ఈ సందర్భంగా ఏజీ, పిటిషనర్ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. కమిషన్ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో లాభం కంటే నష్టమే ఎక్కువ జరిగిందని స్పష్టం చేశారు. కాళేశ్వరం నిర్మాణంలో అధికార దుర్వినియోగం జరిగిందని హైకోర్టుకు ఏజీ వెల్లడించారు. ఇక పిటిషనర్ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. పలువురిపై కమిషన్ తప్పుడు అభియోగాలు నమోదు చేసిందన్నారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో బిజినెస్ రూల్స్ ఎక్కడా ఉల్లంఘించ లేదని స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టినట్లు పిటిషనర్ తరుపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. కేసీఆర్‌ను సాక్షిగా పిలిచి దోషిగా ఆరోపణలు చేయడం సరికాదంటూ న్యాయవాది తన వాదనలు వినిపించారు. తప్పుడు విధానంలో కమిషన్ నోటీసులు ఇచ్చిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ స్థల మార్పిడి, ప్రాజెక్ట్ ఖర్చు అంచనాతోపాటు నిర్మాణ సంస్థలకు ఇవ్వడంలో ఎవరు లబ్ది పొందలేదన్నారు. ఈ కాళేశ్వరం కమిషన్ నివేదిక చెల్లదని.. దీనిపై స్టే ఇవ్వాలని హైకోర్టును పిటిషనర్ న్యాయవాది కోరారు. ఈ వాదనలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణ మార్చి 12వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ

## కడియం విచారణ పూర్తి... దానం విచారణ 7కు వాయిదా

**హైదరాబాద్,మార్చి5 :** పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. గురువారం కడియం శ్రీహరిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించారు. కొన్ని గంటలపాటు సాగిన ఈ విచారణ ముగిసింది. మరో ఎమ్మెల్యే దానం నాగేందర్ విచారణ పూర్తి కాలేదు. ఆయన విచారణను శనివారానికి అంటే.. మార్చి 7వ తేదీకి వాయిదా వేశారు. ఈ కేసులో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు సూచించారు. దీంతో ఈ పిటిషన్లను స్పీకర్ శనివారం విచారించనున్నారు. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొన్న పలువురి ఎమ్మెల్యేల విచారణ ఇప్పటికే పూర్తయింది. వారందరికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చీట్ ఇచ్చిన విషయం విదితమే. ఈ కేసులో ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను విచారించాల్సి ఉంది. ఆయన విచారణ కూడా పూర్తయితే.. ఈ ఫిరాయింపుల వ్యవహారం ఒక కొలిక్కి వస్తుంది.

# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**ముంబై,మార్చి 5 :** ఇరాన్ యుద్ధం కారణంగా బంగారం ధరలు భారీగా పతనం అవుతున్నాయి. రోజురోజుకు తగ్గుతూ ఉన్నాయి. తాజాగా దేశీయ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పడిపోయాయి. గురువారం ఉదయం 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.980 తగ్గి.. రూ.1,63,530 వద్ద ట్రేడ్ అవుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా భారీగానే తగ్గింది. 10 గ్రాములకు రూ.900 తగ్గి.. 1,49,900 పలుకుతోంది. ఇక బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1,64,510 రూపాయలు..10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 1,50,800 రూపాయలు..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 1,23,380 రూపాయలు పలికింది. ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రభావంతో అంతర్జాతీయ గోల్డ్ మార్కెట్‌లో అనిశ్చితి నెలకొంది. ఫలితంగా దేశీయ మార్కెట్‌లో ధరలు భారీగా పతనం అయ్యాయి. హైదరాబాద్ నగరంలో 24, 22,18 క్యారెట్ల బంగారం ధరలు భారీగా తగ్గాయి. 24 క్యారెట్ బంగారంపై 980 రూపాయలు.. 22 క్యారెట్ బంగారంపై 720 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 780 రూపాయలు తగ్గింది. ప్రస్తుతం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం 1,63, 530 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,49, 900 దగ్గర ట్రేడ్ అవుతోంది..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,22,650 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది. రానున్న రోజుల్లో బంగారం ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.



# మూసీ పేరుతో కాంగ్రెస్ దోపిడీ

## మురుగు శుద్ధి కేంద్రాలపై అశ్రద్ధ
## కాంగ్రెస్‌ది విధ్వంస పాలన
## నాగోల్ సమీపంలో మూసీని పరిశీలించిన కేటీఆర్ బృందం





**హైదరాబాద్,మార్చి5 :** మూసీ పేరుతో దోచుకోవడానికే కాంగ్రెస్ ప్రభుత్వం కుటిల ప్రయత్నాలు చేస్తున్నదని సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ పాలనలో వికాసం, కాంగ్రెస్ పాలనలో విధ్వంసం కొనసాగుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఇటుకను పేర్చనోడికి కూల్చే హక్కులేదని మండిపడ్డారు. నాగోల్ మూసీ పరీవాహక ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన సుందరీకరణ పనులను గురువారం బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాడు మూసీలోని మురుగు నీరుని శుద్ధి చేయాలని బీఆర్ఎస్ ముందుకెళ్లింది. దేశంలోనే అతిపెద్దది అయిన నాగోల్ ఎస్టీపీని రూ. 4వేలకోట్లతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇండ్లు కూల్చకండా, భూములు కోల్పోకుండా మూసీని అభివృద్ధి చేశామన్నారు. 2023 డిసెంబర్ వరకు 85 శాతం ఎస్టీపీ నిర్మాణం పూర్తయింది. 15 బ్రిడ్జీలు కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. మిగతా పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బంగారుపల్లెంలో పెట్టి కేసీఆర్ తెలంగాణను అప్పగించారు. కాంగ్రెస్ స్వార్థం కోసం రూ. 16 వేల కోట్ల అయ్యే ప్రాజెక్ట్ వ్యయం పది రెట్లు పెంచి 1.50లక్షల కోట్ల భారీ స్కాంకు తెరతీశారని ఆరోపించారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అరాచకం సృష్టిస్తున్నది. రేవంత్ రెడ్డి అన్న తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్ జోన్‌లో ఉంది అది కూలగొట్టే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. ప్రజలను రోడ్డున పడేసి ఏం సాధిస్తారన్నారు. సీఎం రేవంత్, మంత్రులు ఇలా అందరి ఇళ్లు బఫర్ జోన్‌లో ఉన్నాయి. మహబూబ్‌నగర్‌లో దివ్యాంగులు ఇళ్లు కూల్చారు. ఖమ్మంలో పేదల గుడిసెలను బుల్డోజర్లతో నేలమట్టం చేశారు. ఇవన్నీ రాహుల్ గాంధీకి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలను బయపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. రేవంత్‌కు రూ.16 వేల కోట్లతో మూసీని సుందరీకరించడం చేతకాకపోతే మేము చేసి చూపిస్తామని సవాల్ విసిరారు. రాష్ట్రంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు హద్దే లేదని కేటీఆర్ విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని సీఎం రేవంత్ చెబుతున్నారు. రూ.16వేల కోట్లతోనే ఆ పనులను చేయొచ్చు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు గెలిపించింది హామీల అమలు కోసమేనని గుర్తు చేశారు. రెండున్నరేళ్లలో ఒక్క ఇల్లు నిర్మించినట్లు చూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా. మూసీ సుందరీకరణ పనుల బాధ్యత మాకు అప్పగిస్తే రూ.16వేల కోట్లకే చేసి చూపిస్తాం. ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తాం అని కేటీఆర్ అన్నారు. కెటిఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు ఉన్నారు.

# 2027 కల్లా నాంపల్లి స్టేషన్ ఆధునీకరణ

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్,మార్చి5 :** హైదరాబాద్ నాంపల్లి రైల్వే స్టేషన్‌ను 2027 చివరికల్లా అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఎయిర్‌పోర్ట్ తరహాలో ఆధునిక హంగుల్నీ కల్పిస్తామని వెల్లడించారు. నాంపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై అధికారులతో ఆయన సమీక్షించారు. తొలి దశలో రూ.327 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, దశల వారీగా స్టేషన్ రూపు రేఖలే మారుస్తామని స్పష్టం చేశారు. నాంపల్లి రైల్వేస్టేషన్ నుంచి మెట్రో స్టేషన్‌కు స్కై వాక్ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే సికింద్రాబాద్ ఆధునీకరణ పనులు జోరుగా సాగుతున్నాయని అన్నారు. అలాగే చర్లపల్లిని అత్యాధునకంగా తయారు చేశామని అన్నారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనులు సాగుతున్నాయని అన్నారు.

# పోలీసులతో గస్తీ ముమ్మరం

## రాత్రి వేళల్లో కాలనీల్లో పర్యటన



**హైదరాబాద్,మార్చి5 :** విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఫుట్ పెట్రోలింగ్‌ను మరింత బలోపేతం చేసే దిశగా పోలీసులు వినూత్న కార్యాచరణ చేపట్టారు. కేవలం పెట్రోలింగ్ వాహనాల గస్తీకే పరిమితం కాకుండా, ప్రజల మధ్యకు నేరుగా నడుచుకుంటూ వెళ్తూ 'మేమున్నం' అనే భరోసా కల్పించే విధంగా ఈ కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. ప్యాట్రోల్ కార్లు, బ్లూ కోల్ట్ సిబ్బంది తమ వాహనాలను నిలిపివేసి, నిత్యం ప్రజలతో మమేకమవుతూ జనసంచారం అధికంగా ఉండే ప్రధాన రహదారులు, మార్కెట్ ప్రాంతాలు, బస్టాండ్‌లు, నివాస కాలనీలు, చిన్న చిన్న వీధుల్లో పోలీసులు కాలినడకన పర్యటిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు. ప్రజల్లో భద్రతా భావనను పెంపొందించడం, అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించడం, అనుమానితులను తనిఖీ చేయడమే లక్ష్యంగా ఈ ఫుట్ పెట్రోలింగ్‌ను పోలీసులు సమర్థవంతంగా అమలు చేస్తున్నారు. దీనివల్ల రాత్రి వేళల్లో సామాన్య ప్రజల్లో ధైర్యం పెరగడమే కాకుండా, నేరస్థుల్లో భయం కలుగుతోంది. క్షేత్రస్థాయిలో స్థానికులతో నేరుగా సంభాషించడం ద్వారా కమ్యూనిటీ పోలీసింగ్‌ను బలోపేతం చేస్తూ, నేర నియంత్రణకు పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ప్రజల రక్షణెళి ధ్యేయంగా ఈ ఫుట్ పెట్రోలింగ్ నిరంతరం కొనసాగుతుందని అధికారులు తెలిపారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది వాహనాలను పక్కన పెట్టి, మార్కెట్లు, బస్టాండ్‌లు మరియు నివాస ప్రాంతాల్లో కాలినడకన పర్యటిస్తున్నారు. వాహనాలు వెళ్లలేని ఇరుకైన సందుల్లో కూడా పోలీసులు తిరగడం వల్ల అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పడుతోంది. రాత్రి వేళల్లో పనిచేసే కార్మికులు, వ్యాపారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. అనుమానాస్పద కదలికలు ఉంటే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో కారణం లేకుండా తిరిగే వారు, పాత నేరస్థుల వివరాల సేకరిస్తారు. నిర్మానుష్య ప్రాంతాలలో మద్యం సేవించే వారి కట్టడి, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి పూనుకొంటారు. నంబర్ ప్లేట్ సరిగ్గా లేని, అనుమానాస్పదంగా ఉన్న వాహనాలు తనిఖీ చేస్తారు. ప్రజల మధ్య ఉండటం వల్ల పోలీసులపై ప్రజల్లో భరోసా భావం పెరుగుతుంది. స్థానికులతో స్నేహపూర్వకంగా ఉండడం వల్ల ఒక్కోసారి నేరాలకు సంబంధించిన ముందస్తు సమాచారం తెలుసుకునే వీలుంది. కొత్తంగా కాలినడక గస్తీ వల్ల ప్రజలతో నేరుగా మాట్లాడే అవకాశం లభించడం ద్వారా పోలీసులకు స్థానిక పరిస్థితులపై స్పష్టమైన అవగాహన ఏర్పడుతోందని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఏర్పడటం వల్ల ముఖ్య సమాచారం త్వరగా అందుకునే వీలుందన్నారు. ప్రజల భద్రత కేవలం పోలీసుల బాధ్యతే కాదు, పౌరుల సహకారం కూడా అంతే ముఖ్యం. మీ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద పరిస్థితులు కనిపిస్తే వెనుకాడకుండా పోలీసులకు సమాచారం అందించండి. దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి సమయాల్లో పోలీసులు నిర్వహిస్తున్న ఈ ఫుట్ ప్యాట్రోలింగ్ సరికొత్త ఒరవడిని సృష్టించింది.



# లిక్కర్ కేసు కొట్టేయడంతో స్వామికి మొక్కు

## తిరుమలకు కాలినడకన చేరుకున్న కవిత
## త్వరలోనే రాజకీయ పార్టీ ఏర్పాటు
## తెలంగాణ ఫస్ట్ నినాదంతో ముందుకు వెళతామని ప్రకటన

**తిరుపతి,మార్చి5 :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత తిరుమలకు కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శనం చేసుకునేందుకు తిరుపతి చేరుకున్నారు. తిరుపతిలోని అలిపిరి వద్ద నుంచి కాలినడకన తిరుమల బయల్దేరిన ఆమె.. ముందుగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.. గత నాలుగేళ్లుగా చేయని తప్పుకు తాను మానసిక వేదన అనుభవించానని కవిత తెలిపారు. అయితే దేవుడి దయతో తనపై ఉన్న కేసును కోర్టు పూర్తిగా కొట్టివేసిందని చెప్పారు. ఆ కేసు నుంచి విముక్తి లభిస్తే కాలినడకన తిరుమలకు వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని మొక్కుకున్నానని, ఆ మొక్కును తీర్చుకోవడానికి ఇప్పుడు తిరుమలకు వచ్చానని వెల్లడించారు. అదే సమయంలో తెలంగాణ రాజకీయాల్లో కీలక ప్రకటన చేశారు. మరో రెండు నెలల్లో తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈ పార్టీని స్థాపించనున్నట్లు చెప్పారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా ప్రజలకు సేవ చేసే పార్టీగా దీనిని తీర్చిదిద్దుతామని కవిత తెలిపారు. తెలంగాణ ఫస్ట్ అనే నినాదంతో ప్రజల సమస్యలను మైక్రో లెవెల్‌లో పరిష్కరించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను బీఆర్ఎస్ సరిగా నిర్వహించలేకపోయాయని ఆమె విమర్శించారు. మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ ప్రజలపై తమకు ఎలాంటి ద్వేషం లేదని, రాజకీయ ఆధిపత్యాన్ని మాత్రమే వ్యతిరేకించామని కవిత స్పష్టం చేశారు. అలాగే హైడ్రా చర్యలపై కూడా ఆమె విమర్శలు గుప్పించారు. హైడ్రా పేదలను ఇబ్బంది పెట్టి పెద్దల కోసం పనిచేస్తోందని ఆరోపించారు. తాను ఎప్పుడూ పేదల పక్షాన నిలబడి పోరాడతానని కవిత అన్నారు. అలాగే తనకు న్యాయం చేసిన న్యాయవ్యవస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇరాన్ యుద్ధనౌకప దాడి దారుణం

## తీవ్రంగా ఖండించిన ఇరాన్ మంత్రి.. బదులు తీర్చుకుంటామని హెచ్చరిక

**టెహ్రాన్,మార్చి5 :** ఇరాన్‌పై చేస్తున్న పోరులో భాగంగా.. ఆ దేశ యుద్ధనౌక ఐరిస్ దేనా పై అమెరికా దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్రంగా ఖండించారు. దీనికి తగిన బదులు తీర్చుకుంటామని హెచ్చరించారు. ఇరాన్‌కు 2000 మైళ్ల దూరంలో సముద్రంలో అమెరికా దారుణానికి పాల్పడిందని అరాగ్చీఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ నౌక భారతదేశానికి వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. అక్కడినుంచి తిరిగివెళ్తుండగా అంతర్జాతీయ జలాల్లో ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా దేనాపై దాడి చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి అగ్రరాజ్యం తీవ్రంగా పశ్చాత్తాపపడాల్సిన సమయం త్వరలోనే వస్తుందని హెచ్చరించారు. ఐరిస్ దేనా-75పై అమెరికా జలాంతర్గామితో దాడి చేసి ముంచేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో నౌకలో 180 మంది సిబ్బంది ఉన్నారు. శ్రీలంక భద్రతా దళాలు కొందరిని రక్షించగా, 87 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాయి. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టులో భారీ పేలుళ్లు వినిపించాయి. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ నేవీ స్థావరంపై దాడి జరిగినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇది అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధికి సమీపంలో ఉంటుంది. పేలుళ్ల కారణంగా జరిగిన నష్టం గురించి ఇంకా తెలియరాలేదు.

# ఇరాన్ యుద్ధంతో చిక్కుకున్న భారతీయులు

గల్ఫ్‌లో 23 వేల మంది చిక్కకున్నట్లు కథనాలు

న్యూఢిల్లీ,మార్చి5(ఆర్ఎన్ఎ): ఇరాన్ యుద్ధం నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో 23 వేల మంది భారతీయులు చిక్కుకుపోయినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇరాన్ అణు కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ ఇజ్రాయెల్, అమెరికా దేశాలు దాడులకు దిగడంతో మధ్య ప్రాచ్యంలో ఉద్రిక్తతలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసి వేసింది. ఆ జలాల్లో ప్రయాణించే నౌకలపై దాడులు తప్పవని హెచ్చరించింది. దీంతో, ముడి చమురు రవాణాకు తీవ్ర ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

ఇప్పటికే ఆ ప్రాంతంలో ఉన్న పలు ఆయిల్ ట్యాంకర్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఆయిల్ ట్యాంకర్‌లపై జరిగిన దాడుల్లో కొందరు మరణించారు. వీరిలో ఇద్దరు భారతీయులు ఉన్నట్టు కూడా వెలుగులోకి వచ్చింది. ఇక భారత్ జెండాలతో ప్రయాణిస్తున్న 36 నౌకలు కూడా అక్కడి జలాల్లో నిలిచిపోయాయి. వీటిల్లో అధిక శాతం ముడి చమురు రవాణా నౌకలేనని తెలుస్తోంది. వీటితో పాటు కొన్ని కమర్షియల్ కార్గో, ఎల్‌పీజీ గ్యాస్‌ను తరలించే నౌకలు కూడా ఉన్నాయి. ఏడు నౌకలను స్వయంగా ప్రభుత్వ రంగ షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్నట్టు సమాచారం. హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో భారత్ జెండాలు ఉన్న 12 నౌకలు, తూర్పు వైపున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో మరో 24 నౌకలు ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు, సౌదీ అరేబియాకు సమీపంలోని ఎర్రసముద్రంలో భారత జెండాలున్న నౌకలు లేవని సమాచారం. రెండు నౌకలు మాత్రం ప్రస్తుతం గల్ఫ్ ఆఫ్ ఏడెన్ జలాలను దాటుతున్నాయట. ఈ నౌకల్లో సుమారు 1,074 మంది భారతీయులు ఉన్నారట. యుద్ధ వాతావరణం నెలకొన్న ప్రాంతాల్లో పరిస్థితిని భారత ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోంది. ఆయా ప్రాంతాల్లోని నౌకలను జాగ్రత్తగా గమనిస్తోంది. అక్కడ ఇరుక్కుపోయిన భారతీయ సిబ్బందితో చర్చిస్తోంది. భారతీయ జెండాలు, సిబ్బంది ఉన్న నౌకల భద్రత కోసం పలు చర్యలు తీసుకుంటోంది. ఈ దిశగా మంగళవారం కేంద్ర షిప్పింగ్ శాఖ మంత్రి సర్బానంద సోనోవాల్ సమీక్షా సమావేశం నిర్వహించారు.

# మిషన్ భగీరథలో మరమ్మత్తులు

## రెండ్రోజులు పాటు నీటి సరఫరా నిలిపివేత

**మెదక్,మార్చి5 :** వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య పరిష్కారానికి సమ్మర్ యాక్షన్ ఎ÷-లాన్ తయారీకి చర్యలు తీసుకున్నట్లు మిషన్ భగీరథ ఏఈ నాగభూషణం ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పెద్దరెడ్డిపేట వద్ద పైప్‌లైన్ లీకేజీ మరమ్మతులు, రాయిపహాడ్ వద్ద స్లూయి?సవాల్స్ రిపేర్లు, సివిల్ పనులు, సంపులు శుభ్రపరచడం తదితర నిర్వహణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పనులు పూర్తిచేయడం కోసం సింగూరు నుంచి జిల్లాలకు నీటి సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. మెదక్ నియోజకర్గంలోని 275 నివాస ప్రాంతాలు, మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలు, అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం, టేక్మాల్ మండలాల్లోని 80 నివాస ప్రాంతాల పరిధిలో నేడు, రేపు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వేసవి నిర్వహణ పనుల కోసం చేపడుతున్న ఈ పనులను గుర్తించి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.



# రాజ్యసభకు నితీశ్ నామినేషన్

**హాజరైన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా**

**బీహార్‌తో అనుబంధం కొనసాగుతుందని వెల్లడి**

**బిజెపికి దక్కనున్న కొత్త ముఖ్యమంత్రి పదవి**

**పాట్నా,మార్చి5 :** బీహార్ సీఎం నితీశ్ కుమార్ గురువారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. అసెంబ్లీ కార్యదర్శి ఖ్యాతి సింగ్ కార్యాలయంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సమక్షంలో జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్ నామినేషన్ పేపర్లను అందజేశారు. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసినట్లు నితీశ్ తన ఎక్స్‌లో వెల్లడించారు. ఈ కార్యక్రమం కోసం అమిత్ షా పాట్నాకు వచ్చారు. ఆయనకు సిఎం నితీశ్ స్వాగతం పలికారు. బీహార్‌కు అత్యధిక కాలం సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా నితీశ్ రికార్డు క్రియేట్ చేశారు. అయితే రాజ్యసభలో సభ్యుడు కావాలన్న కాంక్ష ఉన్నట్లు ఆయన తెలిపారు. నితిశ్ తన అభిప్రాయాన్ని ఎక్స్‌లో వ్యక్తం చేశారు. బీహార్ రాజకీయాల్లో పెను మార్పులు జరగనున్నట్లు ఆయన చెప్పారు. నితీశ్ తప్పుకోవడంతో.. బీహార్‌కు బీజేపీ అభ్యర్థి సీఎం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక నితీశ్ కుమారుడు నిషాంత్.. డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. రెండు దశాబ్దాల పాటు తనపై నమ్మకాన్ని, విశ్వాసాన్ని ఉంచారని, దీని ఆధారంగానే బీహార్‌కు సేవ చేశానని, మీ నమ్మకం, మద్దతుతోనే బీహార్‌ను కొత్త అభివృద్ధి కోణం వైపు తీసుకెళ్లినట్లు చెప్పారు. తనపై నమ్మకాన్ని ఉంచి సపోర్టు ఇచ్చినందుకు గతంలో అనేక సార్లు కృతజ్ఞులు చెప్పినట్లు నితీశ్ పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానం మొదలైన నాటి నుంచి.. బీహార్ అసెంబ్లీ, మండలితో పాటు.. పార్లమెంట్ ఉభయసభల్లోనూ సభ్యుడిని కావాలన్న కాంక్ష ఉండేదని చెప్పారు. ఆ కోరికతోనే రాజ్యసభ సభ్యుడిని అయ్యే సందర్భం వచ్చిందన్నారు. భవిష్యత్తులో మీతో ఇదే రకమైన రిలేషన్ కొనసాగుతుందన్నారు. కొత్తగా ఏర్పడబోయే ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉంటుందన్నారు. బీహార్ సీఎం పోస్టు రేసులో నిత్యానంద్ రాయ్‌తో సమ్రాట్ చౌదరీ ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.

# ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు మోడీ ఫోన్

**యుద్ధంపై దౌత్యానికి పిలుపు**

**న్యూఢిల్లీ,మార్చి5 :** మధ్యప్రాచ్యం సంక్షోభం వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ప్రధాని మోడీ ఫోన్ చేశారు. యుద్ధం విషయంలో దౌత్యానికి మోడీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో మోడీ పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హతమయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్, అమెరికా మద్దతు గల గల్ఫ్ దేశాలపై విరుచుకుపడింది. గల్ఫ్ దేశాల్లో భారీగా ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో గల్ఫ్ దేశాధినేతలకు మోడీ ఫోన్ చేసి ఖండించారు. తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఫోన్ చేసి యుద్ధం ముగింపునకు దౌత్యం నిర్వహించాలని కోరారు. 'ఈ రోజు నా స్నేహితుడు అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో మాట్లాడాను. పశ్చిమాసియా పరిస్థితి, చర్చలు, దౌత్యానికి సంబంధించి మా ఉమ్మడి ఆందోళనలను చర్చించాం. శాంతి, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించడానికి మేము దగ్గరగా పాల్గొనడం, ప్రయత్నాలను సమన్వయం చేయడం కొనసాగిస్తాం.' అని రాసుకొచ్చారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ఈ సంభాషణ జరిగిందని.. ప్రపంచ నాయకులు సంయమనం, దౌత్యపరమైన చర్చలకు మోడీ పిలుపునిచ్చారు. గత నెల 28న ఇరాన్ అధ్యక్ష భవనంపై ఇజ్రాయెల్, అమెరికా దాడి చేశాయి. దీంతో ఖమేనీ సహా కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు చనిపోయారు.

అనంతరం ఇరాన్ కూడా ప్రతీకారంగా దాడులకు దిగింది. ప్రస్తుతం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

# బెంగాల్ గవర్నర్ ఆనందబోస్ రాజీనామా

**రాజకీయ ఒత్తిళ్లు కారణమై ఉండొచ్చన్న మమత**

**కోల్‌కతా,మార్చి5 :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్రంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర గవర్నర్ సీవీ ఆనంద బోస్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని పశ్చిమ బెంగాల్ లోక్ భవన్ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆయన రాజీనామాకు గల స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. సీవీ ఆనంద బోస్ రాజీనామాపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందించారు. ఆయన రాజీనామా విషయం తెలిసి తాను షాకయ్యానని చెప్పారు. 'గవర్నర్ రాజీనామాకు గల కారణం ప్రస్తుతానికి నాకు కూడా తెలియదు. ప్రస్తుత పరిస్థితుల్ని చూస్తుంటే నాకేమీ ఆశ్చర్యం అనిపించడం లేదు. త్వరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి నుంచి ఆయన మీద రాజకీయపరమైన ఒత్తిడి ఉండొచ్చు. కొత్త గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని నియమిస్తున్నట్లు కేంద్ర మంత్రి నుంచి సమాచారం అందింది. గవర్నర్ తొలగింపు, కొత్త గవర్నర్ నియామకంలో కేంద్ర మంత్రి నన్ను సంప్రదించలేదు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. సహకార విధానానికి కేంద్రం తగిన గౌరవం, ప్రాధాన్యం ఇవ్వాలి. రాష్ట్రాల గౌరవాన్ని కాపాడాలని మమత వ్యాఖ్యానించారు. ఇక.. గవర్నర్‌గా రాజీనామా చేసిన సీవీ ఆనంద బోస్ పశ్చిమ బెంగాల్‌లో మూడున్నరేళ్లు సేవలందించారు. ఆయనకు, సీఎం మమతా బెనర్జీకి మధ్య అనేక విబేధాలు తలెత్తాయి. అందువల్లే గవర్నర్ల వ్యవస్థను మమత తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆనంద బోస్ ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. ఆయన కేంద్ర మంత్రుల్ని తన రాజీనామా విషయంపై సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ వెలువడనుంది.

# తగ్గేదే లేదంటున్న ఇరాన్

**ఇజ్రాయిల్, అమెరికాలకు దీటుగా జవాబు**

**మిస్సైళ్లు, డ్రోన్‌లతో విరుచుకు పడుతున్న ఇరాన్**

**చైనా సహకారంతోనే అంటూ..అంతర్జాతీయ కథనాలు**



**టెహ్రాన్,మార్చి5 :** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడుల నేపథ్యంలో ఇరాన్ ఇటీవల దీటుగా బదులిస్తోంది. దాడుల్లో ఎక్కడా తగ్గడం లేదు. తమ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మృతి అనంతరం మధ్య ప్రాచ్య దేశాలపై ఇరాన్ భీకర దాడులు చేపట్టింది. భారీ ఆయుధాలతో విరుచుకుపడుతూ పశ్చిమాసియా దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఓవైపు ఇరాన్ వద్ద ఆయుధ నిల్వలు తగ్గిపోతున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. మరోవైపు.. ఇజ్రాయెల్, అమెరికా ఆస్తులే కాకుండా యూఏఈ, ఒమన్, బహ్రెయిన్, సౌదీ అరేబియా వంటి 10 దేశాలపై ఇరాన్ ఏకధాటిగా దాడిచేస్తున్న విధానాన్ని చూస్తే ఆ దేశం వద్ద భారీ క్షిపణులు, డ్రోన్లు ఉన్నాయనే సందేహం తలెత్తకమానదు. అయితే.. దశాబ్దాలుగా ఆ దేశం ఎంతో కృషిచేసి ఇంత భారీఎత్తున ఆయుధ సామగ్రిని నిర్మించుకుంది. మరి ఆ దేశం ఆయుధగారాన్ని పెంచుకోవడంలో చైనా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా స్పష్టమవుతోంది. ఆ మీడియా నివేదికల ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులకు ముందే ఇరాన్‌కు చైనా ఆయుధాలను సరఫరా చేసినట్టు తెలుస్తోంది. వీటిలో ఆయుధాల్లో షాహిద్ క్లాస్ కామికేజ్ డ్రోన్ల నుంచి ఫత్తాహ్ క్లాస్ హైపర్‌సోనిక్ మిసైల్స్ వరకు ఇరాన్ భద్రతా వ్యూహంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి శత్రు దేశాలపై దాడిచేయగల సామర్థ్యాన్ని ఇవి కలిగి ఉంటాయి. అయితే.. ఇరాన్ ఈ ఆయుధాలను అభివృద్ధి చేసుకోవడంలో చైనా పాత్ర ఎంతమేర ఉందనేదానిపై స్పష్టత లేదు. ఇక.. గత శుక్రవారం ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు దాడిచేసి.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చిన సంగతి తెలిసిందే. ఆ ఘటన తర్వాత ఇరాన్‌కు ప్రమాదకర ఆయుధాలను, అదనపు రక్షణ ఎలా పొందాలో చైనా వివరించిందని మధ్యప్రాచ్యంలోని ఓ మీడియా సంస్థ నివేదించింది. ఇదిలా ఉండగా.. చైనా తయారుచేసిన సీఎం 302 యాంటీ షిప్ క్షిపణుల కొనుగోలుపై ఇరాన్-చైనా ఒప్పందం చేసుకోవాలనుకున్నట్టు రాయిటర్స్ తన కథనంలో రాసుకొచ్చింది. ఇక.. ఇరాన్ ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఆయుధాలలో ఎక్కువ భాగం ఆ దేశంలోనే ఉత్పత్తి అయినవే అయినప్పటికీ.. వాటిలో చాలావరకు చైనా పాత డిజైన్ల ఉత్పత్తులు లేదా చైనా తయారీ భాగాలపై ఆధారపడి ఇరాన్ రూపొందించుకుని ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే.. కొన్నేళ్లుగా ఇరాన్ ఆయుధగార నిర్మాణంలో చైనా కీలకంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో డ్రాగన్ దేశం సాయంలేకుండా.. ఇరాన్ ఇంత పెద్దఎత్తున క్షిపణులు, డ్రోన్ల సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం అసాధ్యమని అంతర్జాతీయ నిపుణులు భావిస్తున్నారు. కాగా.. ఇరాన్‌కు1979-1989 కాలంలో తొలిసారి ఆయుధాలు సరఫరా చేసింది చైనా. పశ్చిమ దేశాలు విధించిన ఆయుధ నిషేధాల నడుమ 1986లో హై 2, సీ 801 యాంటీ షిప్ వ్యవస్థలను నాడు చైనా సరఫరా చేసింది. ఇరాన్‌కు చైనా అతిపెద్ద ఆయుధ సరఫరాదారుల్లో ఒకటని స్టాక్‌హోమ్ పీస్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. విమానాలు, క్షిపణులు, తుపాకీ వ్యవస్థలు సహా రక్షణ పరికరాలను అందించిందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. 2005లో ఇంటర్నేషనల్ ఆటోమిక్ ఎనర్జీ ఏజెన్సీ ఇరాన్ అణు వ్యాప్తి నిరోధక ఒప్పందం పాటించలేదనే కారణంగా ఇరాన్‌కు చైనా ఆయుధ సామగ్రి సరఫరాను నిలిపివేసింది. అమెరికా ఆంక్షలు చైనా ఆయుధ విక్రయాలను మరింత నియంత్రించాయి.

# అమెరికా మరో దుస్సాహసం

**అణు వార్‌హెడ్ క్షిపణి పరీక్ష**



**వాషింగ్టన్,మార్చి5 :** పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల నడుమ అమెరికా భారీ అణు సామర్థ్యం గల క్షిపణి పరీక్ష నిర్వహించడం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. అమెరికా సైన్యం కాలిఫోర్నియా తీరంలో ఉన్న వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి శక్తిమంతమైన మినిట్‌మ్యాన్-3 ను విజయవంతంగా ప్రయోగించింది. ఈ పరీక్షను అమెరికా సాధారణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిందని అధికారులు వెల్లడించారు. ఈ క్షిపణి పరీక్ష సాంటా బార్బరా సమీపంలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి నిర్వహించారు. ఈ ప్రయోగంలో నిరాయుధ రాకెట్‌ను ఉపయోగించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ప్రయోగించిన క్షిపణి పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మార్షల్ ఐస్ ల్యాండ్ సమీపంలోని లక్ష్యాన్ని కచ్చితంగా తాకినట్లు అమెరికా స్పేస్ ఫోర్స్ వెల్లడించింది. మినిట్‌మ్యాన్-3 క్షిపణి అమెరికా రక్షణ వ్యవస్థలో కీలక భాగమని అధికారులు తెలిపారు. ఈ క్షిపణి అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉంటుంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో హిరోషిమాపై పడేసిన అణుబాంబుల కంటే 20 రెట్లు శక్తివంతమైన వార్‌హెడ్‌లను మోయగల క్షిపణి అని అధికారులు చెబుతున్నారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ ప్రకారం.. ఈ పరీక్ష పూర్తిగా రక్షణాత్మక ప్రయోజనాల కోసం నిర్వహించిందని అధికారులు తెలిపారు. క్షిపణి వ్యవస్థ కచ్చితత్వం, ప్రభావం, సిద్ధంగా ఉండే చర్యలను పరీక్షించడం ప్రధాన లక్ష్యమని అధికారులు వివరించారు. అలాగే వివిధ మిషన్ ప్రొఫైల్స్ ద్వారా మినిట్‌మ్యాన్-3 వ్యవస్థ పనితీరును మెరుగుపరచడానికి ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అమెరికా భూమి ఆధారిత అణు దాడి వ్యవస్థ సిద్ధతను నిర్ధారించుకోవడమే ఈ పరీక్ష ముఖ్య ఉద్దేశమని అధికారులు పేర్కొన్నారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో రక్షణ వ్యవస్థలు ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇటీవల అమెరికా, ఇజ్రాయెల్‌లు కలిసి ఇరాన్‌పై దాడులు చేసిన నేపథ్యంలో ఈ క్షిపణి పరీక్ష జరగడం ప్రపంచవ్యాప్తంగా చర్చకు దారితీసింది. అయితే ఈ పరీక్షకు ఆ ఘటనలతో ప్రత్యక్ష సంబంధం లేదని అమెరికా స్పష్టం చేసింది.

# అమెరికా కోసం భారత నావికాదళం


**అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్**

**వార్తలను తిప్పికొట్టిన భారత ప్రభుత్వం**

**న్యూఢిల్లీ,మార్చి5 :** మధ్యప్రాచ్యంలో కొన్ని రోజులుగా భీకర యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా నావికాదళం భారత నౌకలను ఉపయోగిస్తోందంటూ విస్తృతంగా జరుగుతున్న ప్రచారాలను కేంద్రం ఖండించింది. ఆ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం, నిరాధారమని కేంద్ర విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా మాజీ ఆర్మీ కల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ ఇటీవల ఓ ఛానల్ ఇంటర్వ్యూ సందర్భంగా మాట్లాడుతూ.. 'గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలపై ఒత్తిడి పెరగడంతో మా నావల్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. మా నౌకాశ్రయ సదుపాయాలూ ధ్వంసమయ్యాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో మేము భారత్, ఆ దేశానికి చెందిన నౌకాశ్రయాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇది సరైన మార్గం కాదు. అయినప్పటికీ పరిస్థితుల ప్రభావం కారణంగా అలా చేయక తప్పడం లేదు' అని మాక్‌గ్రెగర్ అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం కావడంతో ఈ వివాదం చెలరేగింది. దీనిపై స్పందించిన కేంద్ర విదేశాంగ శాఖ ఫ్యాక్ట్‌చెక్ విభాగం.. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఖండించింది. 'భారత పోర్టులు అమెరికా దాడులకు ఉపయోగిస్తున్నాయన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు' అని 'ఎక్స్' వేదికగా ప్రకటించింది. నిర్ధారణ లేని సమాచారం సోషల్ మీడియాలో పోస్ట్ చేయొద్దని హెచ్చరించింది.

# మరోమారు సోనూసూద్ ఉదారత

**గల్ఫ్‌లో చిక్కుకున్న వారికి వసతి సైకర్యం ఆఫర్**



**ముంబై,మార్చి5 :** కరోనా కష్టకాలంలో నటుడు సోనూసూద్ దేశవ్యాప్తంగా ప్రజలను ఎంతగా ఆదుకున్నారో తెలిసిందే! వలస కార్మికులకు అండగా నిలిచారు. ఎంతో మందికి ఉపాధి చూపించారు. విదేశాల్లో చిక్కుకున్న వారిని ప్రత్యేక విమానాల ద్వారా తమ ఇళ్లకు చేర్చారు. ఇలా ఆపదలో ఉన్న వారికి 'నేనున్నా' అంటూ అండగా నిలుస్తూ.. తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ఇప్పుడు యుద్ధ పరిస్థితుల కారణంగా విమాన సర్వీసులు రద్దు కావడంతో దుబాయ్‌లో చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఆయన సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అక్కడ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఉచితంగా వసతి కల్పిస్తామని ప్రకటన చేశారు. ఏ దేశస్థులైనా సరే, ఎలాంటి షరతులు లేకుండా ఈ సదుపాయం ఉపయోగించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. 'కష్ట సమయంలో మనసున్న మనిషిగా ముందుకు రావడం ఎంతో అవసరం. సహాయం అవసరమైనవారు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా డిటైల్స్‌తో మెసేజ్ చేయండి. మా టీమ్ తక్షణమే స్పందిస్తారు' అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు. తనను సంప్రదిస్తే వారికి అక్కడే ఉచిత వసతిని సమకూరుస్తానని ప్రకటించారు.



# ఏ ఆహారాలు అజీర్ణానికి కారణమవుతాయి?

నేటి వేగవంతమైన జీవనశైలి, సరికాని ఆహారపు అలవాట్ల వల్ల చాలా మంది అజీర్ణ సమస్యతో బాధపడుతున్నారు. సమయానికి భోజనం చేయకపోవడం, ఎక్కువగా వేయించిన పదార్థాలు లేదా బయట ఆహారం తినడం వల్ల ఈ సమస్య మరింత పెరుగుతుంది. అజీర్ణం అంటే జీర్ణవ్యవస్థ ఆహారాన్ని సరిగ్గా జీర్ణం చేయలేని పరిస్థితి. దీని వల్ల కడుపులో బరువు, గ్యాస్, గుండెల్లో మంట అసౌకర్యం వంటి సమస్యలు కనిపిస్తాయి. కొన్నిసార్లు తిన్న తర్వాత కడుపు నొప్పి, వికారం లేదా ఆమ్లత్వం కూడా కలగవచ్చు. ఈ లక్షణాలను చాలామంది చిన్న సమస్యగా తీసుకుంటారు. కానీ తరచుగా అజీర్ణం వస్తే అది మరొక ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చు.

## ఏ ఆహారాలు అజీర్ణానికి కారణమవుతాయి?

ఆరోగ్య నిపుణుల ప్రకారం.. వేయించిన, చాలా కారంగా ఉండే ఆహారాలు అజీర్ణానికి ప్రధాన కారణాలు. ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్, ఎక్కువ నూనెతో తయారుచేసిన పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అలాగే అధిక చక్కెర ఉన్న పదార్థాలు, శీతల పానీయాలు, కెఫిన్ ఉన్న పానీయాలు కూడా జీర్ణక్రియను దెబ్బతీస్తాయి. రాత్రి ఆలస్యంగా ఎక్కువగా తినడం కూడా అజీర్ణాన్ని పెంచుతుంది. ఎక్కువ మసాలాలు ఉన్న ఆహారం, ప్రాసెస్ చేసిన పదార్థాలు, ప్యాక్ చేసిన స్నాక్స్ వల్ల గ్యాస్, ఆమ్లత్వం సమస్యలు వస్తాయి. కొంతమందికి పాలు లేదా పాల పదార్థాలు కూడా అజీర్ణానికి కారణమవుతాయి.

## అజీర్ణాన్ని ఎలా నివారించాలి?

అజీర్ణం రాకుండా ఉండాలంటే తేలికైన, సమతుల్య ఆహారం తీసుకోవాలి. సమయానికి భోజనం చేయాలి. ఎక్కువగా ఆకలి వేసే వరకు వేచి ఉండకూడదు. వేయించిన పదార్థాలు, జంక్ ఫుడ్ తగ్గించడం మంచిది. ఆహారాన్ని బాగా నమిలి తినడం, సరిపడా నీరు తాగడం కూడా ముఖ్యమే. ప్రతిరోజూ కొద్దిసేపు నడవడం లేదా తేలికపాటి వ్యాయామం చేయడం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవడం, రాత్రి ఆలస్యంగా భోజనం చేయకపోవడం మంచిది.

## వైద్యుడిని ఎప్పుడు సంప్రదించాలి?

అజీర్ణం తరచుగా వస్తూ ఉంటే, తీవ్రమైన కడుపు నొప్పి ఉంటే, వాంతులు లేదా రక్తస్రావం కనిపిస్తే, లేదా ఆకస్మికంగా బరువు తగ్గితే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. అజీర్ణాన్ని నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు. సమయానికి పరీక్షలు చేయించుకుని చికిత్స తీసుకుంటే పెద్ద సమస్యలను నివారించవచ్చు.

# భారత్‌లో పెరిగిపోతున్న బాల ఊబకాయులు

**అమెరికాను దాటి రెండో స్థానానికి**

**5-9 మధ్య వయస్కుల్లో 1.4 కోట్ల మందికి ఊబకాయం : ప్రపంచ ఒబేసిటీ అట్లాస్ నివేదిక**




మన దేశంలో ఊబకాయులైన చిన్నారుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా బాల ఊబకాయులు లేదా అధిక బరువు ఉన్న దేశాల్లో అమెరికాను వెనక్కి నెట్టి మనవాళ్లు రెండో స్థానంలో నిలిచారు. మొదటి స్థానంలో చైనా బాలలు ఉన్నారు. 5-9 ఏళ్ల మధ్య వయసున్న బాలలు 1.49 కోట్ల మంది, 10-19 ఏళ్ల మధ్య వయస్కులు 2.6 కోట్ల మంది ఊబకాయులు లేదా అధిక బరువు ఉన్నారని ప్రపంచ ఒబేసిటీ అట్లాస్-2026 తాజాగా వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా 5-19 ఏళ్ల మధ్య వయస్సున్న పిల్లల్లోని ప్రతి ఐదుగురిలో ఒకరు (20.7శాతం) ఊబకాయం లేదా అధిక బరువుతో ఉన్నారని తెలిపింది. 2010 నుంచి చూస్తే ఇది 14.6 శాతం పెరిగిందని చెప్పింది. 2025లో భారత్‌లో అధిక బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ఉన్న వారు 4.1 కోట్ల వరకు ఉండొచ్చని పరిశోధకులు అంచనా వేశారు. చైనా విషయానికి వస్తే అధిక బీఎంఐ ఉన్న పిల్లలు 6.2 కోట్లు, ఊబకాయులు 3.3 కోట్ల మంది ఉన్నారు. అధిక బీఎంఐతో 2.7 కోట్ల మంది, ఊబకాయులు 1.3 కోట్ల మంది పిల్లలతో అమెరికా మూడో స్థానంలో ఉంది. "అధిక బరువు, ఊబకాయం ఉన్న పిల్లల సంఖ్య భారత్‌లో వేగంగా పెరుగుతోంది. అది ఏటా 5 శాతంగా ఉంటోంది. అది ఆందోళన కలిగించే అంశం. ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక శ్రమ లేకపోవడం ఈ పరిస్థితికి కారణం" అని ప్రపంచ ఒబేసిటీ ఫెడరేషన్ సీఈవో జొహన్నా రాల్స్టన్ అన్నారు. .

## ఆరోగ్యపరంగా రిస్క్ ఎక్కువ

- 2025-40 మధ్య చిన్న పిల్లల్లో ఊబకాయ పరిస్థితులు, ఆరోగ్య సమస్యలు ఎలా ఉంటాయో ఒబేసిటీ అట్లాస్ అంచనా వేసింది. వాటి ప్రకారం.. భారత్‌లో బాల ఊబకాయల సంఖ్య 2 కోట్లకు పెరుగుతుంది. మొత్తంగా 5.6 కోట్ల మంది ఊబకాయులు లేదా అధిక బరువున్న వారు ఉంటారు.
- అధిక బీఎంఐతో 5 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న వారిలో ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతాయి.
- రక్తపోటు బాధితులు 29 లక్షల నుంచి 42 లక్షలకు, మధుమేహ బాధితులు 13 లక్షల నుంచి 19 లక్షలకు, అధిక ట్రైగ్లిజరైడ్స్ బాధితులు 43 లక్షల నుంచి 60 లక్షలకు పెరుగుతారు.
- ఈ అధిక బరువు వల్ల పిల్లల్లో రక్తపోటు, గుండెజబ్బులు వంటి దీర్ఘకాలిక రోగాలు వస్తాయి.
- 2040నాటికి 5.7 కోట్ల మందిలో ముందస్తు గుండెజబ్బు సూచనలు కనిపిస్తాయి. 4.3 కోట్ల మంది రక్తపోటు బాధితులు ఉంటారు.
- ప్రపంచ ఒబేసిటీ ఫెడరేషన్ అంచనాల ప్రకారం 2040 నాటికి ప్రపంచవ్యాప్తంగా మొత్తం 50కోట్ల మంది పిల్లలు ఊబకాయం లేదా అధిక బరువుతో ఉంటారు.

## ఊబకాయానికి కారణాలు ఇవీ..

శారీరక శ్రమ లోపించడం వల్ల కౌమార దశలో ఉన్న 11-17 మధ్య వయసు పిల్లల్లో 74శాతం మంది ఊబకాయులు అవుతున్నారు. బడికి వెళ్లే పిల్లల్లో 35.5 శాతం మంది మాత్రమే బడిలో భోజనం చేస్తున్నారు. 6-10 ఏళ్ల మధ్య ఉన్నవారు సగటున రోజుకు 50 మిల్లీ లీటర్ల వరకు చక్కెర పానీయాలు తాగుతున్నారు. దాదాపు 32.6% మంది శిశువులకు తల్లిపాలు సరిగ్గా అందడంలేదు. భారత భవిష్యత్‌తరాన్ని రక్షించడానికి అత్యవసరంగా చర్యలు తీసుకోవాలని ప్రపంచ ఒబేసిటీ అట్లాస్ సూచించింది. పాఠశాలల పరిసరాల్లో సరైన ఆహార వాతావరణం, అనారోగ్య కారక ఆహార పదార్థాల మార్కెటింగ్ పట్ల సరైన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొంది.

# ఉదయం ఖాళీ కడుపుతో ఎన్ని గ్లాసుల నీరు తాగాలి?

చాలా మందికి ఉదయం నిద్రలేవగానే ఖాళీ కడుపుతో నీరు తాగే అలవాటు ఉంటుంది. ఇది మంచి అలవాటుగా భావిస్తారు. అయితే, ఉదయం ఎంత నీరు తాగాలి? ఎక్కువగా తాగాలా? లేక ఒకటి రెండు గ్లాసులు సరిపోతాయా? అనే సందేహాలు చాలామందికి ఉంటాయి.

ఉదయం ఎంత నీరు తాగాలి?

ఆరోగ్య నిపుణుల ప్రకారం, ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి నుంచి రెండు గ్లాసుల నీరు తాగడం సరిపోతుంది. ఒకేసారి ఎక్కువగా తాగితే కడుపులో అసౌకర్యం కలగొచ్చు. నీరు నెమ్మదిగా తాగడం మంచిది. అలాగే చాలా తక్కువ నీరు తాగితే శరీరానికి పూర్తిగా ప్రయోజనం ఉండదు. కాబట్టి సమతుల్యంగా తాగడం ముఖ్యం.

## ఉదయం నీరు తాగడం వల్ల ప్రయోజనాలు

రాత్రి సమయంలో వచ్చిన డీహైడ్రేషన్ తగ్గుతుంది.

శరీరం తాజాగా, తేలికగా అనిపిస్తుంది.

జీర్ణక్రియ ప్రారంభమవుతుంది.



రోజంతా హైడ్రేటెడ్‌గా ఉండటానికి సహాయపడుతుంది.

బద్ధకం తగ్గి చురుకుదనం పెరుగుతుంది.

ఉదయం నీరు తాగడం వల్ల రోజంతా సరైన పరిమాణంలో నీరు తాగే అలవాటు కూడా వస్తుంది.

## జాగ్రత్తలు

ఒకేసారి ఎక్కువగా నీరు తాగకూడదు.

కడుపు లేదా మూత్రపిండ సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలి.

ముఖ్యంగా, మీ శరీరం ఇచ్చే సంకేతాలను గమనించడం చాలా అవసరం. దాహం, అసౌకర్యం వంటి లక్షణాలను బట్టి నీరు తీసుకోవాలి. బలవంతంగా కాకుండా సహజంగా ఈ అలవాటును అలవరచుకోవడం మంచిది.

# మద్యం తాగకపోయినా లివర్ దెబ్బతింటోంది.. కారణమిదేనట..

ఇటీవలి కాలంలో మద్యం సేవించని వారిలో కూడా కాలేయ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సమస్యను మొదట్లోనే గుర్తించి అరికట్టడం అవసరం. కాలేయ సమస్యల లక్షణాలు ప్రారంభ దశలో స్వల్పంగా మాత్రమే కనిపిస్తాయి. దీని కారణంగా, చాలా మంది తేలికగా తీసుకుంటారు. కానీ ఇలా చేయడం ఆరోగ్యానికి మంచిది కాదు. అసలు కాలేయం దెబ్బతినడానికి కారణాలు ఏంటి? కాలేయ సమస్యలు ఎవరిలో ఎక్కువగా వస్తాయి? ఆ సమస్యలు రాకుండా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం..

మద్యం తాగకుండా కూడా కాలేయం ఎలా దెబ్బతింటుందో అర్థంకాక చాలామంది ఆందోళనకు గురవుతున్నారు. ఈ అంశంపై ఆరోగ్య నిపుణులు పలు కీలక వివరాలు చెబుతున్నారు. కాలేయ సమస్యల లక్షణాలు ప్రారంభ దశలో కొద్దిగా మాత్రమే కనిపిస్తాయి. దీని కారణంగా, చాలా మంది సమస్యను తేలికగా తీసుకుంటారు. కానీ ఇది నెమ్మదిగా శరీరంలో బలహీనత, ఆకలి లేకపోవడం, కడుపులో కుడి వైపున భారంగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి. కొంతమందికి గ్యాస్, అజీర్తి, బరువు పెరగడం వంటి వివిధ సమస్యలు ఎదురవుతాయి. చర్మం, కళ్ళు పసుపు రంగులోకి మారడం, మూత్రం ముదురు పసుపు రంగులోకి మారడం, కాళ్ళలో వాపు కూడా కాలేయం పనిచేయడం లేదని చెప్పడానికి సంకేతాలు. ఈ కారణంగా మద్యం అలవాటు లేని వారు తమ కాలేయ ఆరోగ్యం గురించి జాగ్రత్తగా ఉండటం అవసరం.

కాలేయం దెబ్బతినడానికి కారణాలు ఏమిటి, ఎవరికి అలాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది, దానిని నివారించడానికి ఏం చేయాలి?

## కాలేయం దెబ్బతినడానికి కారణాలు..

ఆరోగ్య నిపుణుల ప్రకారం.. కాలేయం దెబ్బతినడానికి ఆల్కహాల్ మాత్రమే కారణం కాదు. సరైన ఆహారం తీసుకోకపోవడం, వేయించిన ఆహారాలు, జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం వల్ల



కాలేయంపై అదనపు భారం పడుతుంది. వ్యాయామం లేకపోవడం, అధిక బరువు కాలేయ సమస్యలకు దారితీస్తుంది. వైద్యుడిని సంప్రదించకుండా ఎక్కువ కాలం మందులు తీసుకోవడం వల్ల కూడా కాలేయం దెబ్బతింటుంది.

దీనితో పాటు, వైరల్ ఇన్ఫెక్షన్లు, కలుషితమైన నీరు లేదా ఆహారం ద్వారా వ్యాపించే వ్యాధులు కూడా కాలేయాన్ని ప్రభావితం చేస్తాయి. ఒత్తిడి, క్రమరహిత దినచర్య, నిద్ర లేకపోవడం శరీర జీవక్రియను అస్థిరపరుస్తాయి. కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. కొన్నిసార్లు, కాలేయ వ్యాధులకు కుటుంబ నేపథ్యం కూడా కారణమై ఉండొచ్చు. ఇది ప్రమాదాన్ని మరింత పెంచుతుంది.

## ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంది?

అధిక బరువు ఉన్నవారు, మధుమేహం ఉన్నవారు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. శారీరకంగా చురుకుగా లేనివారు, జంక్ ఫుడ్ క్రమం తప్పకుండా తినేవారికి కూడా కాలేయ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ కాలం మందులు తీసుకునేవారు, బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారు కూడా ఎక్కువ ప్రమాదంలో ఉంటారు. కాలేయ వ్యాధి కుటుంబ నేపథ్యం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి.

## ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..

కాలేయ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమతుల్యమైన, ఇంట్లో వండిన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. వేయించిన, ప్రాసెస్ చేసిన ఆహారాలను తినొద్దు. ప్రతిరోజూ కొంత వ్యాయామం చేయాలి. నడవాలి. పుష్కలంగా నీరు తాగాలి. సమయానికి తినాలి. వైద్యుడి సలహా లేకుండా మందులు తీసుకోవద్దు. బరువును అదుపులో ఉంచుకోవాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం చేయాలి.

# ఘనంగా అర్జున్ టెండూల్కర్, సానియా వివాహం

భారత మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ఇంట్లో పెళ్లివేడుకలు జరిగాయి. సచిన్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహం ఘనంగా జరిగింది. అర్జున్, సానియా చందోక్‌ను వివాహం చేసుకున్నాడు. మార్చి 3న మహాలక్ష్మి రేస్ కోర్స్‌లో ఒక ప్రైవేట్ మెహందీ వేడుక నిర్వహించారు. ఈ వేడుకకు పలువురు క్రికెటర్లు హాజరయ్యారు. ఈరోజు ముంబైలో అర్జున్, సానియాల వివాహం ఇరుకుటుంబాల పెద్దలు, బంధువులు, పలువురు ప్రముఖుల సమక్షంలో ఘనంగా జరిగింది. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనితో సహా పలువురు క్రికెటర్లు, ఇతర రంగాలకు చెందిన ప్రముఖ అతిథులు కూడా ఈ వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అర్జున్ వివాహ వేడుకల్లో ఐసీసీ ఛైర్మన్ జైషా, టీమిండియా మాజీ క్రికెటర్, ప్రస్తుత సెలెక్టర్ అజిత్ అగార్కర్ కూడా కనిపించారు. వీరితో పాటు మాజీ భారత ఆటగాడు, మాజీ కోచ్ రాహుల్ ద్రవిడ్ తన భార్య విజేత పెంధార్కర్?తో కలిసి వేడుకకు హాజరయ్యాడు. మాజీ క్రికెటర్లు అజింక్య రహానే, అనిల్ కుంబ్లే, సురేష్ రైనా, వెంకటేష్ ప్రసాద్, ఆకాష్ చోప్రా, టీఎంసీ ఎంపీ యూసుఫ్ పఠాన్ వంటి దిగ్గజాలు ఈ వేడుకలో పాల్గొన్నారు.కుమారుడి వివాహానికి సచిన్ టెండూల్కర్ పలువురు రాజకీయ ప్రముఖులను కూడా ఆహ్వానించారు. వీరిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, లోక్‌సభలో ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వంటి వారు ఉన్నారు. రాజకీయ, క్రీడా, సినీ, వ్యాపార, ఇతర రంగాలకు చెందిన ప్రముఖుల రాకతో పెళ్లి వేడుకలో సందడి నెలకొంది. అర్జున్ టెండూల్కర్ వివాహం చేసుకున్న అమ్మాయి పేరు సానియా చందోక్. ఆమె అర్జున్‌కు స్నేహితురాలు, చాలా కాలం నుంచి వీరు ప్రేమించుకునంటున్నారుని తెలుస్తోంది. ఆమె ముంబై పారిశ్రామికవేత్త రవి ఘాయ్ మనవరాలు. సానియా చందోక్ ఒక 'పెట్ కేర్' బ్రాండ్‌ను నిర్వహిస్తోంది. అక్కడ జంతువుల స్కిన్ కేర్, గ్రూమింగ్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. ఐపీఎల్ 2026లో అర్జున్ టెండూల్కర్ లక్నో సూపర్ జెయింట్స్ జట్టు తరపున ఆడనున్నాడు. అంతకుముందు అర్జున్ టెండూల్కర్ ముంబై ఇండియన్స్ జట్టు తరపున ప్రాతినిథ్యం వహించాడు. ఐపీఎల్ వేలంలో లక్నో జట్టు అర్జున్ ను తీసుకుంది. లక్నో జట్టు అర్జున్‌కు ఎన్ని అవకాశాలు ఇస్తుంది, అతడి ప్రదర్శన ఎలా ఉ ంటుందోనని సచిన్ ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



## దశాబ్దాల నుంచి మారని
# సౌతాఫ్రికా తీరు!




సౌతాఫ్రికా గుండె మరోసారి బద్దలైంది. ఐసీసీ వరల్డ్‌కప్‌ను ముద్దాడాలన్న ఆశలు మళ్లీ ఆవిరైపోయాయి. ఓటమిలేకుండా వరుస విజయాలతో సెమీస్ చేరిన సఫారీలు అసలైన పోరులో బోల్తా కొట్టారు. అయితే ప్రతి మెగా టోర్నీలోనూ టైటిల్ ఫేవరెట్‌గా బరిలోకి దిగడం, లీగ్ మ్యాచుల్లో ప్రత్యర్థులను చిత్తు చేస్తూ అజేయంగా ముందుకు సాగడం, తీరా సెమీఫైనల్ లేదా ఫైనల్ వంటి కీలక సమయం వచ్చేసరికి చేతులెత్తేయడం ఈ జట్టుకు అలవాటుగా మారిపోయింది. 2026 టీ20 ప్రపంచకప్‌లో కూడా సరిగ్గా ఇదే జరిగింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ విభాగాల్లో ఎంతో బలంగా ఉండి, సూపర్ 8లో భారత్ వంటి టాప్ జట్టును కూడా ఓడించిన సఫారీలు, సెమీస్‌లో మాత్రం చిత్తవ్వడం అభిమానులకు మింగుడుపడటం లేదు. అసలు ఈ 'చోకర్స్' ట్యాగ్ నుంచి సౌతాఫ్రికా ఎప్పుడు బయటపడుతుంది? దశాబ్దాలుగా వెన్నాడుతున్న ఆ శాపం ఏంటి? అనే అంశాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ గెలిచిన సౌతాఫ్రికా, సెమీఫైనల్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన పోరులో ఏమాత్రం కాన్ఫిడెంట్‌గా కనిపించలేదు. మొదట బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 169 పరుగులు మాత్రమే చేయగలిగింది. కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో మార్‌క్రమ్ (18), డికాక్ (10) వంటి స్టార్ ఆటగాళ్లు త్వరగానే పెవిలియన్ చేరారు. మార్కో యాన్సెన్ 55 పరుగులతో పోరాడినప్పటికీ జట్టుకు భారీ స్కోరు లభించలేదు. అనంతరం 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్, కేవలం 12.5 ఓవర్లలోనే ఒకే ఒక వికెట్ కోల్పోయి 173 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. 9 వికెట్ల తేడాతో సౌతాఫ్రికా ఓడిపోవడం తమ నాకౌట్ వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది.సౌతాఫ్రికా క్రికెట్ చరిత్రలో ఎంతోమంది దిగ్గజ ఆటగాళ్లు ఉన్నా ఇప్పటివరకు ఐసీసీ వరల్డ్?కప్? ట్రోఫీ కూడా ఆ దేశానికి లభించలేదు. టీ20 ప్రపంచకప్, 50 ఓవర్ల వరల్డ్ కప్ ఏ ఫార్మాట్?లోనూ వారు విజేతగా నిలవలేకపోయారు. టాలెంట్?కు కొదవ లేకపోయినా కీలక మ్యాచుల్లో ఒత్తిడిని జయించలేకపోవడం ఈ జట్టుకు పెద్ద బలహీనతగా మారింది. 2025లో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గెలిచి కొంత ఉపశమనం పొందినప్పటికీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మాత్రం ఆ ఆశ ఇంకా తీరలేదు. సెమీఫైనల్ వరకు వచ్చి ఖాళీ చేతులతో వెనుదిరగడం సఫారీ జట్టుకు ఒక నిరంతర వేదనగా మారిపోయింది.నాకౌట్ మ్యాచుల్లో సౌతాఫ్రికా తడబడటం అనేది 1992 నుంచి మొదలైంది. ముఖ్యంగా 1999 వన్డే వరల్డ్?కప్ సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై జరిగిన ఆ రనౌట్ ఉదంతం ఇప్పటికీ క్రికెట్ చరిత్రలో ఒక పీడకలగా మిగిలిపోయింది. గెలవడానికి ఒక్క పరుగు మాత్రమే కావాల్సిన సమయంలో జరిగిన ఆ గందరగోళం సౌతాఫ్రికాకు 'చోకర్స్' అనే ముద్రను వేసింది. అంతకుముందు 1996 క్వార్టర్ ఫైనల్, 2015, 2023 సెమీఫైనల్స్?లోనూ ఇలాగే ఓటమిపాలయ్యారు. 2024 టీ20 ఫైనల్‌లో భారత్?పై చేజేతులా మ్యాచ్?ను పోగొట్టుకున్నారు. ఈ మ్యాచ్?లో 7 పరుగుల తేడాతో ఓడిపోవడం వారి హార్ట్ బ్రేక్ చరిత్రలో మరో బిగ్ షాక్.సౌతాఫ్రికా జట్టుకు టీ20 ప్రపంచకప్ చరిత్రలో నాకౌట్ దశ ఒక తీరని కలగానే మిగిలిపోయింది. ఈ టోర్నీ ఆరంభం నుంచి చూస్తే 2007, 2010, 2012 సంవత్సరాల్లో సూపర్ 8 దశకే పరిమితమైన ప్రోటీస్ జట్టు 2009, 2014 సంవత్సరాల్లో సెమీఫైనల్ వరకు వచ్చి ఓటమిపాలైంది. 2016లో సూపర్ 10 దశలో, 2021, 2022లో సూపర్ 12 దశలోనే వెనుదిరగాల్సి వచ్చింది. ఇక 2024లో అద్భుతంగా ఆడి ఫైనల్ చేరి రన్నరప్‌గా నిలిచినప్పటికీ, 2026 ఎడిషన్‌లో మళ్లీ సెమీఫైనల్‌లోనే వెనుదిరగడం ఆ జట్టు నాకౌట్ వైఫల్యాల పరంపరను కొనసాగిస్తోంది. దశాబ్దాల కాలంగా ఎందరో దిగ్గజాలు మారినా, ఈ ఫార్మాట్‌లో సౌతాఫ్రికాకు సెమీస్ గండం మాత్రం ఒక పీడకలలా వెంటాడుతోంది. దశాబ్ద కాలంగా డేవిడ్ మిల్లర్ సౌతాఫ్రికాకు బలమైన పిల్లర్?గా ఉంటున్నాడు. జట్టు ఓడిపోయే స్థితి నుంచి అనేకసార్లు బయటపడేశాడు. కెరీర్?లో అనేక మ్యాచ్?ల్లో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ స్టార్ హిట్టర్ మిల్లర్ ప్రస్తుత టోర్నీలోనూ తన వంతు ప్రయత్నం చేశాడు. కెనడాపై 39, భారత్?పై 63, జింబాబ్వేపై 22 పరుగులు చేస్తూ జట్టును ముందుకు నడిపించారు. 36 ఏళ్ల వయసులో కూడా తన దేశం కోసం ఒక్క వరల్డ్ కప్ అయినా గెలవాలని ఎంతో పట్టుదలతో పోరాడుతున్నాడు. ప్రస్తుతం జట్టులో సీనియర్ మోస్ట్ ప్లేయర్ అయిన మిల్లర్, ఒత్తిడిలోనూ నిలకడగా రానిస్తూ 'ఫామ్ పర్మనెంట్' అని నిరూపిస్తున్నారు. కానీ జట్టుగా చూస్తే మాత్రం దురదృష్టం వెంటాడుతూనే ఉంది.

# టీ20 వరల్డ్ కప్ ఫైనల్ చేరిన భారత్...

**బెతెల్ మెరుపు సెంచరీ వృథా**

**ముంబై వేదికగా ఇంగ్లండ్ తో జరిగిన సెమీఫైనల్లో భారత్ విజయం**

**మొదట బ్యాటింగ్ చేసి 253 పరుగుల భారీ స్కోరు సాధించిన టీమిండియా**

**భారత్ తరపున సంజు శాంసన్, ఇంగ్లండ్ తరపున బెతెల్ మెరుపు ఇన్నింగ్స్**

**ఆఖరి ఓవర్లో ఉత్కంఠ నడుమ 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఓటమి**





ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఐసీసీ పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్లో పరుగుల వరద పారింది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఈ హైస్కోరింగ్ సమరంలో ఇంగ్లండ్ పై భారత్ 7 పరుగుల తేడాతో విజయం సాధించి ఫైనల్ లోకి ప్రవేశించింది. ఇంగ్లండ్ బ్యాటర్ జాకబ్ బెతెల్ (105) వీరోచిత సెంచరీతో పోరాడినప్పటికీ, ఆఖరి ఓవర్లో రనౌట్ రూపంలో వెనుతిరగడంతో ఇంగ్లండ్ ఆశలు ఆవిరయ్యాయి. 254 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (5), కెప్టెన్ బట్లర్ (25), హ్యారీ బ్రూక్ (7) త్వరగానే పెవిలియన్ చేరారు. ఈ దశలో జాకబ్ బెతెల్ ఒంటరి పోరాటం చేశాడు. భారత బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 48 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 105 పరుగులు చేసి మ్యాచ్ ను మలుపు తిప్పాడు. అతనికి విల్ జాక్స్ (35) చక్కటి సహకారం అందించాడు. వీరిద్దరి దూకుడుతో ఒకానొక దశలో ఇంగ్లండ్ గెలిచేలా కనిపించింది. అయితే ఆఖరి ఓవర్లో ఇంగ్లండ్ విజయానికి 30 పరుగులు అవసరం కాగా, శివమ్ దూబే బౌలింగ్ కు దిగాడు. మొదటి బంతికే డేంజర్ మ్యాన్ బెతెల్ రనౌట్ కావడంతో మ్యాచ్ భారత్ వైపు తిరిగింది. జోఫ్రా ఆర్చర్ చివర్లో వరుసగా మూడు సిక్సర్లు బాదినప్పటికీ, అప్పటికే ఆలస్యం కావడంతో ఇంగ్లండ్ 246 పరుగులకే పరిమితమైంది. మొత్తమ్మీద ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసింది. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా 2 వికెట్లు తీయగా, బుమ్రా, అర్ష్‌దీప్, అక్షర్, వరుణ్ తలో వికెట్ పడగొట్టారు. అంతకుముందు, టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకోగా, భారత బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఓపెనర్ సంజు శాంసన్ ఇంగ్లండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 42 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్ కు గట్టి పునాది వేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (39), శివమ్ దూబే (43) దూకుడుగా ఆడగా, చివర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21), హార్దిక్ పాండ్యా (27) మెరుపులతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్ 61 పరుగులు సమర్పించుకోగా, జాక్స్, రషీద్ చెరో రెండు వికెట్లు తీశారు. ఈ విజయంతో భారత్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. టీ20 ప్రపంచకప్ లో టీమిండియా వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. 2024లో టీమిండియా ఛాంపియన్ గా నిలవడం తెలిసిందే. ఇక, టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ లో టీమిండియా.... న్యూజిలాండ్ తో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ టైటిల్ సమరం మార్చి 8న అహ్మదాబాద్ లో జరగనుంది.

# హోటల్‌లో అమ్మాయిలతో పాక్ క్రికెటర్ అసభ్య ప్రవర్తన!

పాకిస్థాన్ క్రికెట్ జట్టును వివాదాలు వెంటాడుతూనే ఉన్నాయి. అటు మైదానంలో వరుస పరాజయాలు, ఇటు మైదానం బయట ఆటగాళ్ల క్రమశిక్షణారాహిత్యం ఆ దేశ క్రికెట్ బోర్డును ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. తాజాగా ఒక ఆటగాడి అసభ్య ప్రవర్తనకు సంబంధించిన వార్త సంచలనం సృష్టిస్తోంది. ప్రపంచ కప్ ప్రదర్శన కంటే కూడా ఇప్పుడు ఒక వివాదాస్పద ఘటన పాకిస్థాన్ క్రికెట్ పరువును బజారున పడేసింది. టీ20 ప్రపంచ కప్ సూపర్-8 దశలో భాగంగా శ్రీలంకలోని కాండీలో పాక్ జట్టు బస చేసింది. ఆ సమయంలో ఒక గుర్తు తెలియని పాక్ క్రికెటర్, హోటల్‌లోని మహిళా హౌస్ కీపింగ్ సిబ్బందితో అత్యంత అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు వచ్చాయి. బాధితురాలు వెంటనే అప్రమత్తమై అలారం మోగించడంతో హోటల్ యాజమాన్యం జోక్యం చేసుకుంది. ఈ విషయం తీవ్రరూపం దాల్చడంతో హోటల్ సీనియర్ అధికారులు కఠిన చర్యల కోసం పట్టుబట్టారు. అయితే, టీమ్ మేనేజర్ నవీద్ చీమా మధ్యవర్తిత్వం వహించి హోటల్ వర్గాలకు క్షమాపణలు చెప్పారు. ఆ ఆటగాడికి భారీ జరిమానా విధించి, ప్రస్తుతానికి విషయాన్ని బయటకు పొక్కకుండా మేనేజ్ చేశారు. కానీ, పీసీబీ ఈ కేసును ఇంకా క్లోజ్ చేయలేదని సమాచారం. టీ20 ప్రపంచకప్‌లో జట్టు వైఫల్యాలు, బోర్డు తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలు పాక్ క్రికెట్‌ను పీకల్లోతు కష్టాల్లోకి నెట్టాయి. ప్రపంచకప్‌లో పేలవ ప్రదర్శన, ముఖ్యంగా భారత్ చేతిలో ఓటమిని పీసీబీ సీరియస్‌గా తీసుకుంది. దీనికి బాధ్యతగా ప్రతి ఆటగాడికి రూ.50 లక్షల (పాక్ రూపాయలు) భారీ జరిమానా విధించినట్లు నివేదికలు చెబుతున్నాయి.బంగ్లాదేశ్‌తో జరగాల్సిన వన్డే సిరీస్ కోసం ప్రకటించిన జట్టులో బాబర్ అజామ్, సైమ్ అయూబ్ వంటి కీలక ఆటగాళ్లను తొలగించడం పెను దుమారం రేపుతోంది. టీ20 వైఫల్యానికి వన్డే జట్టు నుండి వారిని తప్పించడాన్ని అభిమానులు తప్పుబడుతున్నారు. మరోవైపు ఇరాన్, యూఎస్-ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ ఉద్రిక్తతల వల్ల బంగ్లాదేశ్ పర్యటన పూర్తిగా రద్దయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి..........

# క్యూరేటర్‌తో గంభీర్ వాగ్వాదం..



ముంబైలోని ప్రతిష్టాత్మక వాంఖడే స్టేడియంలో టీ20 వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్‌కు ఆతిథ్యమిస్తోంది. భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య జరగనున్న ఈ హై వోల్టేజ్ పోరుకు ముందు పిచ్ రిపోర్ట్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా వాంఖడే పిచ్ బ్యాటర్లకు స్వర్గధామంలా ఉ ంటుంది, కానీ ఈసారి బయటకు వచ్చిన పిచ్ దృశ్యాలు టీమిండియా మేనేజ్‌మెంట్‌ను కాస్త కలవరపెడుతున్నాయి. పిచ్‌పై స్పష్టంగా కనిపిస్తున్న పచ్చని గడ్డి, పేస్ బౌలర్లకు వరంగా మారేలా కనిపిస్తోంది. పిచ్ కండిషన్స్ చూసిన భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, పిచ్ క్యూరేటర్‌తో తీవ్రంగా చర్చించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. మంగళవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్ సమయంలో గంభీర్ క్యూరేటర్‌తో చాలా సీరియస్‌గా మాట్లాడటం, అసంతృప్తి వ్యక్తం చేయడం వంటి దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పిచ్‌పై గడ్డి ఉండటం వల్ల బంతి అనూహ్యంగా స్వింగ్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే ఇంగ్లాండ్ పేసర్లు జోఫ్రా ఆర్చర్, మార్క్ ఉడ్ వంటి వారు భారత టాప్ ఆర్డర్‌ను ఇబ్బంది పెట్టే ప్రమాదం ఉంది.వాంఖడే స్టేడియం చరిత్రను పరిశీలిస్తే, ఇక్కడ ఛేజింగ్ చేయడం సులభమని పేరుంది. కానీ ఈ గడ్డి పిచ్ కనుక మారకపోతే, టాస్ గెలిచిన జట్టు మొదట బౌలింగ్ ఎంచుకుని ప్రత్యర్థిని దెబ్బకొట్టాలని చూస్తుంది. ఇంగ్లాండ్ ఆటగాళ్లకు ఐపీఎల్ వల్ల ఇక్కడి పరిస్థితులపై మంచి అవగాహన ఉంది. ఒకవేళ పిచ్ పేసర్లకు అనుకూలిస్తే, ఇంగ్లాండ్ బౌలింగ్ అటాక్ భారత్‌కు కఠిన సవాల్ విసరడం ఖాయం. మరోవైపు భారత్ కూడా జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్‌లపై భారీ ఆశలు పెట్టుకుంది. ఈ పిచ్ వివాదంపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. సొంత గడ్డపై జరుగుతున్న మ్యాచ్‌లో మనకు అనుకూలమైన స్పిన్ పిచ్ కాకుండా, పేస్ ఫ్రెండ్లీ పిచ్‌ను సిద్ధం చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తుంటే, అసలైన పోరు పిచ్‌తో సంబంధం లేకుండా ఆటగాళ్ల ప్రతిభపైనే ఆధారపడి ఉంటుందని మరికొందరు అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా, గంభీర్ ఆందోళన చూస్తుంటే మ్యాచ్ గమనాన్ని పిచ్ శాసించబోతోందని స్పష్టమవుతోంది.

# దిశాపటానీకి చుక్కలే

బాలీవుడ్ తెరపై ఘాటైన రొమాన్స్, సీరియల్ ముద్దులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఇమ్రాన్ హష్మీ మరోసారి తన పాత రూట్లోకి వస్తున్నారు. ఈ వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో సెన్సేషన్‌గా మారింది. బాలీవుడ్ సీరియల్ కిస్సర్ గా ముద్ర వేయించుకున్న ఇమ్రాన్ హష్మీ గత కొంతకాలంగా తన ఇమేజ్‌ను మార్చుకునే ప్రయత్నం చేస్తూ వచ్చారు. రొమాంటిక్ హీరో పాత్రల కంటే నటనకు ప్రాధాన్యమున్న పాత్రల వైపు మొగ్గు చూపారు. ఈ క్రమంలోనే టాలీవుడ్‌లో పవన్ కళ్యాణ్ ఓజిలో పవర్‌ఫుల్ విలన్ పాత్రలో నటించారు. నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతో తనలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తూ బాలీవుడ్ కిస్సర్ ఇమేజ్‌కు దూరంగా జరుగుతున్నారని అందరూ అనుకున్నారు. కానీ తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం.. ఇమ్రాన్ మళ్ళీ తన మార్కు రొమాన్స్‌తో వెండితెరను హీటెక్కించబోతున్నారు. ఆయన కెరీర్‌లో వన్ ఆఫ్ ది బెస్ట్ మూవీ అయిన -అవారాపన్- సినిమాకు ఇప్పుడు సీక్వెల్ -అవారాపన్ 2- సిద్ధమవుతోంది. ఈ సినిమాలో ఇమ్రాన్ హష్మీ తన పాత సీరియల్ కిస్సర్ ఇమేజ్‌కు న్యాయం చేస్తూ మరోసారి చెలరేగిపోనున్నారట. గ్యాప్ తర్వాత వస్తున్న ఈ సినిమాలో రొమాన్స్ డోస్ మునుపటి కంటే ఎక్కువే ఉంటుందని టాక్. ఈ సీక్వెల్‌లో ఇమ్రాన్ సరసన గ్లామరస్ బ్యూటీ దిశా పటానీ నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోతోంది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో ఇమ్రాన్ - దిశాల మధ్య ఏకంగా ఆరు నుండి ఎనిమిది సార్లు లిప్ లాక్ సన్నివేశాలు ఉండబోతున్నాయట. తెరపై అరడజనుకు పైగా ముద్దు సీన్లతో ఇమ్రాన్ తన రికార్డును తానే తిరగరాయబోతున్నారు. ఇది విన్న నెటిజన్లు సరదాగా బహుశా టైగర్ ష్రాఫ్ కూడా దిశాను అన్నిసార్లు కిస్ చేసి ఉండడు ఏమో! అంటూ కామెంట్స్ చేస్తున్నారు. బాలీవుడ్‌లో ఒకే సినిమాలో అరడజను లేదా అంతకంటే ఎక్కువ సార్లు కిస్ సీన్లు చేసిన హీరోల జాబితాలో ఇమ్రాన్ హష్మీ ఎప్పుడూ అగ్రస్థానంలో ఉంటారు. గతంలో మర్డర్, ఆషిక్ బనాయా ఆప్నే వంటి సినిమాల్లో ఆయన రికార్డ్ స్థాయి ముద్దు సీన్లతో సంచలనం సృష్టించారు. ఆయన తర్వాత రణబీర్ కపూర్ (రాక్ స్టార్, ఏ దిల్ హై ముష్కిల్), రణవీర్ సింగ్ (బేఫికర్) వంటి హీరోలు కూడా తెరపై ఘాటైన ముద్దు సీన్లతో, రొమాంటిక్ సన్నివేశాలతో ఆకట్టుకున్నారు. ముఖ్యంగా -బేఫికర్- సినిమాలో రణవీర్ - వాణీ కపూర్ మధ్య లెక్కలేనన్ని కిస్ సీన్లు ఉన్న సంగతి తెలిసిందే. సాధారణంగా బాలీవుడ్ సినిమాల్లో కిస్ సీన్లు కామన్ అయినా కానీ.. ఇమ్రాన్ హష్మీ రొమాన్స్‌కు ఒక ప్రత్యేకమైన స్టైల్ ఉంటుంది. హీరోయిన్లతో బెడ్‌రూమ్ రొమాన్స్ అయినా.. ఘాఢమైన ముద్దులైనా ఆయన ఆ పాత్రల్లో జీవిస్తారనే పేరుంది. అందుకే ఆయనను ఇప్పటికీ బాలీవుడ్ అసలైన సీరియల్ కిస్సర్‌గా అభివర్ణిస్తుంటారు. ఇప్పుడు దిశా పటానీతో అతడి ముద్దు సీన్లు కేక పెట్టిస్తాయని అంచనాలున్నాయి.



# వృషకర్మ ఈవెంట్‌లో కిందపడ్డ నాగచైతన్య

## తన కెరీర్లోనే బెస్ట్ సినిమా అన్న దర్శకుడు కార్తీక్ దండు

'వృషకర్మ' ఈవెంట్‌లో హీరో నాగచైతన్య పడిపోయారు. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ మూవీ గ్లింప్స్ రిలీజ్ ఈవెంట్‌ను ప్రసాద్ ఐమ్యాక్స్ పీసీఎక్స్ స్క్రీన్‌లో గురువారం నిర్వహించారు. ఈ వేడుకలో చిత్ర బృందం స్పీచ్ పూర్తయ్యాక మీడియాతో చిట్‌చాట్ కోసం కుర్చీలను వేదికపై తీసుకొచ్చారు. ఓ కుర్చీలో నాగచైతన్య కూర్చోగానే అది ఒక్కసారిగా వంగిపోయింది. దీంతో, చైతన్య వెనక్కిపడిపోయారు. చిత్ర బృందం, అభిమానులు ఆందోళన వ్యక్తం చేశారు. చైతన్యకు ఏమైనా దెబ్బ తగిలిందేమోనంటూ కంగారుపడ్డారు. అప్పటికే తేరుకున్న చైతన్య.. పక్కనే ఉన్న దర్శకుడు కార్తీక్ దండు సహాయంతో లేచి మరో కుర్చీలో కూర్చున్నారు. సిబ్బందిపై చైతన్య కాస్త అసహనం వ్యక్తం చేస్తూనే.. వృషకర్మ చిత్రం గురించి మీడియా అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. విరూపాక్ష'తో టాలీవుడ్‌ను వణికించిన దర్శకుడు కార్తీక్ దండు, ఇప్పుడు నాగచైతన్యతో కలిసి 'వృషకర్మ' అనే భారీ మిథికల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో కార్తీక్ తన సినీ ప్రయాణం, అక్కినేని కుటుంబంతో తనకున్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. కార్తిక్ మాట్లాడుతూ.. 'ఏ దర్శకుడికైనా తన హీరోకి కెరీర్ బెస్ట్ సినిమా ఇవ్వాలని ఉంటుంది. నేను అక్కినేని నాగచైతన్యకు తన కెరీర్‌లోనే ది బెస్ట్ సినిమా ఇస్తున్నాను' అని కార్తీక్ దండు ఎంతో కాన్ఫిడెంట్‌గా చెప్పారు. అంతేకాకుండా, 'నాకు సినిమాపై ఇష్టం పెరగడానికి కారణం కింగ్ నాగార్జున గారే. ఆయనే నా మొదటి హీరో. అలాంటిది ఈరోజు ఆయన అబ్బాయితో సినిమా చేయడం, అది కూడా ఇంత పెద్ద స్థాయిలో చేయడం నా అదృష్టం' అంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే, ఈ సినిమా విజువల్స్ మిథికల్ ఎలిమెంట్స్ కోసం చిత్ర బృందం గత రెండేళ్లుగా ఎంతో కష్టపడుతోందని, గ్లింప్స్ అనేది కేవలం శాంపిల్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. సుకుమార్ రైటింగ్స్, ÷ఎఅఅ బ్యానర్లపై వస్తున్న ఈ చిత్రం నాగచైతన్యను ముందెన్నడూ చూడని ఒక కొత్త అవతారంలో చూపించబోతోందని కార్తీక్ మాటల ద్వారా అర్థమవుతోంది. దర్శకుడికి హీరోపై ఉన్న ఈ నమ్మకం, అక్కినేని ఫ్యాన్స్‌లో సినిమాపై భారీ అంచనాలను పెంచేసింది.





# ఎట్టకేలకు ఓటిటిలోకి .. భర్తమహాశయులకు విజ్ఞప్తి

మాస్ మహారాజ రవితేజ నటించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. కిషోర్ తిరుమల దర్శకత్వం వహించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి ప్రేక్షకుల నుంచి ఓ మాదిరి స్పందన అందుకుంది. అయితే ఈ సినిమా ఇప్పటి వరకు ఓటిటి స్ట్రీమింగ్ మాత్రం కాలేదు. సాధారణంగా థియేటర్ విడుదలైన సినిమాలు 4 నుంచి 6 వారాల్లో ఓటిటిలోకి వస్తాయి. అయితే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' విషయంలో స్ట్రీమింగ్ కాలేదు. ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను ప్రముఖ ఓటిటి ఎ÷-లాట్‌ఫామ్ జీ 5 కొనుగోలు చేసింది. ఆ మధ్య స్ట్రీమింగ్ చేస్తున్నట్టు ప్రకటించారు కానీ అనుకోని కారణాల వలన వాయిదా వేశారు. అనేక మార్లు ఓటీటీ స్ట్రీమింగ్ వాయిదా వేసిన ఈ సినిమా మొత్తానికి ఓటీటీ రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. ఈ సినిమాను ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్‌కు తీసుకురాబోతున్నారు. థియేటర్ రిలీజ్‌కు సుమారు 59 రోజుల తర్వాత ఓటిటిలో స్ట్రీమింగ్‌కు రానుండటం గమనార్హం. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం ఈ ఎక్కువ క్షి విండోకి మధ్యలో ఎదురైన కొన్ని ఆర్థిక సమస్యలే కారణమని తెలుస్తోంది. అయితే ఈ విషయంపై చిత్ర బృందం లేదా ఓటిటి ఎ÷-లాట్‌ఫామ్ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరి ఈ సారైనా ఓటీటీ స్ట్రీమింగ్ కు వస్తుందో లేదా మరోసారి వాయిదా వేస్తారో మరికొద్ది రోజుల్లో తెలుస్తుంది. మరి ఓటిటిలో విడుదలైన తర్వాత ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన అందుకుంటుందో చూడాలి.

# ఉస్తాద్ కొత్త రిలీజ్ డేట్..

## నిర్మాతలకు కాసుల వర్షం!

మెగాస్టార్ చిరంజీవి తమ్ముడిగా సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన పవన్ కళ్యాణ్.. అతి తక్కువ సమయంలోనే పాన్ ఇండియా వైడ్ గుర్తింపు సొంతం చేసుకున్నారు. తన మేనరిజంతో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న పవన్ కళ్యాణ్ .. ప్రస్తుతం 10 సంవత్సరాల రాజకీయ పోరాటం తర్వాత ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ కి డీసీఎం గా బాధ్యతలు చేపట్టి.. ఇటు నాయకుడిగా, అటు సినిమా హీరోగా రెండు పడవల మీద ప్రయాణాన్ని చక్కగా బ్యాలెన్స్ చేసుకుంటూ దూసుకుపోతున్నారు.

ఈ క్రమంలోనే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తర్వాత జ్యోతి కృష్ణ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు' సినిమా చేసి పర్వాలేదనిపించుకున్న ఈయన సాహో డైరెక్టర్ సుజిత్ దర్శకత్వంలో 'ఓజీ' సినిమా చేసి రికార్డులు క్రియేట్ చేశారు. ప్రస్తుతం గబ్బర్ సింగ్ తర్వాత మళ్లీ ప్రముఖ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. మార్చి 26వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ.. వారం ముందే అనగా మార్చి 19వ తేదీన ఈ సినిమాను విడుదల చేస్తున్నామని అధికారికంగా ప్రకటించారు. ఇక దీంతో ఈ విషయం కాస్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వారం ముందే ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫిలిమ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో నిర్మాతలు ఈ రిలీజ్ డేట్ ను మార్చడం వెనుక అసలు విషయం తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యంగా సినిమాకి మొదటి షో హిట్ టాక్ గనక లభించినట్లయితే.. ఈ చిత్రంనిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తుంది అనడంలో సందేహం లేదు అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఏ హీరో అయినా సరే తమ సినిమాను విడుదల చేసేటప్పుడు కచ్చితంగా హాలిడేస్ ను పరిగణలోకి తీసుకొని మరీ తమ సినిమాను విడుదల చేస్తారు. అయితే ఇక్కడ ఉస్తాద్ కోసం మేకర్స్ తీసుకున్న నిర్ణయానికి ఏకంగా 10 రోజులు కలిసి రావడం ఎవరు ఊహించని పరిణామం.



# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

**మేయర్ కొలగాని శ్రీనివాస్**




కరీంనగర్: ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డివిజన్ల వారీగా ప్రజా సమస్యలను పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ సూచించారు. గురువారం కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో పారిశుధ్యం, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, స్థాపన, జనన మరణాల నమోదు విభాగాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మేయర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 66 డివిజన్లలో 99 రోజులపాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతుందని చెప్పారు. మొదటి పది రోజులు నగరపాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టడంతో పాటు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. మొదటి రోజు హనుమాన్ నగర్, చంద్రపురి కాలనీలలో కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఐదు డివిజన్లలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి డ్రైనేజీలు శుభ్రం చేయడం, చెత్త తొలగించడం, ఖాళీ స్థలాలను పరిశుభ్రం చేయడం వంటి పనులు చేయాలని అధికారులకు సూచించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా నీటి లీకేజీలను గుర్తించి పరిష్కరించడంతో పాటు వీధి దీపాల మరమ్మతులు, అవసరమైన చోట కొత్త దీపాల ఏర్పాటు చేయాలని అన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం భవన అనుమతులకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం, నీటి సరఫరా, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని తెలిపారు. నగరపాలక సంస్థలో పెండింగ్‌లో ఉన్న జనన--మరణ నమోదు, ఆస్తి అంచనా, వ్యాపార అనుమతులు, గృహ అనుమతులు తదితర దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వేణు మాధవ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" విజయవంతం చేయాలి

**కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్: ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు జిల్లాలో నిర్వహించనున్న "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కార్యక్రమ నిర్వహణపై అధికారులతో చర్చించారు. ఐదు దశల్లో 99 రోజులపాటు నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధం కావాలని సూచించారు. శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభలు, ఏప్రిల్ 16న మండల స్థాయి సమావేశాలు, మే 2న నియోజకవర్గ స్థాయి కార్యక్రమాలు, మే 22న జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, ఆరోగ్యం, సంక్షేమం, పిల్లల భద్రత, మత్తు పదార్థాల నిర్మూలన, రైతు సంక్షేమం, విద్య, యువత--క్రీడలు, మహిళలు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, ముఖ్య ప్రణాళిక అధికారి రామ్ దత్తారెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు పతకాలు

కరీంనగర్: స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ--టెక్నో పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించడం ద్వారా సంభాషణ నైపుణ్యాలు పెరుగుతాయని, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఇవి ఎంతో అవసరమని తెలిపారు. కఠిన సాధనతో ఇంగ్లీష్‌లో దిట్టగా మారి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. సిల్వర్ జోన్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు పలు పతకాలు సాధించారు. 4వ తరగతిలో ఏ. శ్రియాన్ రెడ్డి రజత పతకం, వి. వేదవిహార్ బంగారు పతకం, జి. విశాల్ కాంస్య పతకం సాధించారు. 6వ తరగతిలో కే. సుకృత బంగారు పతకం గెలుచుకున్నారు. 7వ తరగతిలో ఏం. లిఖిత్ రజత పతకం, బి. తన్మయి బంగారు పతకం, పి. సుశ్రిత్ కాంస్య పతకం సాధించారు. 8వ తరగతిలో ఏం. విగ్నేష్ చంద్ర బంగారు పతకం, ఎల్. అక్షయ రజత పతకం గెలుచుకున్నారు. 9వ తరగతిలో టి. అమిత విక్రమ్ బంగారు పతకం, సిహెచ్ శ్రీహిత రజత పతకం, ఏ. యాష్ చంద్ర కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




## మొండి బకాయిదారులపై చర్యలు: దుకాణాలు సీజ్



కరీంనగర్: ఆస్తి పన్నులు చెల్లించని మొండి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా డివిజన్ల వారీగా నియమించిన ప్రత్యేక బృందాలు నగరంలో పర్యటించి పన్నులు వసూలు చేస్తున్నాయి. పన్నులు చెల్లించని బకాయిదారుల ఆస్తులను సీజ్ చేయడం జరుగుతోంది. ఈ సందర్భంగా కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ స్వయంగా పలువురు వ్యాపార సంస్థలను సందర్శించి పన్నులు చెల్లించని దుకాణాలను తాళం వేసి సీజ్ చేయించారు. టాప్ 100 మొండి బకాయిదారుల జాబితా ప్రకారం వారికి ఎరుపు నోటీసులు జారీ చేసి గడువులోగా పన్నులు చెల్లించని దుకాణాలను సీజ్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆస్తులకు కూడా నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసుల గడువు పూర్తైనప్పటికీ పన్నులు చెల్లించని ఎనిమిది దుకాణాలను సీజ్ చేసినట్లు తెలిపారు. నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్ల 'మ్యూల్ అకౌంట్ల'పై పోలీసుల ఉక్కుపాదం




కరీంనగర్, ఫిబ్రవరి 05: సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్న మ్యూల్ ఖాతాలపై పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. రాష్ట్ర సైబర్ భద్రత విభాగం చేపట్టిన "ఆపరేషన్ క్రాక్‌డౌన్"లో భాగంగా కరీంనగర్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఈ చర్యలు చేపట్టినట్లు పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. కమీషన్లకు ఆశపడి తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించిన వారిని గుర్తించినట్లు చెప్పారు. కరీంనగర్ నగరంలోని నాలుగు ప్రధాన బ్యాంకుల్లో మొత్తం 34 మ్యూల్ ఖాతాలను గుర్తించినట్లు తెలిపారు. ఈ ఖాతాలపై జాతీయ సైబర్ నేర నివేదికల పోర్టల్ ద్వారా 162 ఫిర్యాదులు అందినట్లు వెల్లడించారు. ఈ ఖాతాల ద్వారా సైబర్ నేరగాళ్లు వెయ్యికి పైగా అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు విచారణలో తేలిందన్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు 20 కేసులు నమోదు చేసి నిందితులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 112 ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు చిన్న మొత్తాల కమీషన్లకు ఆశపడి తమ బ్యాంకు ఖాతా వివరాలు, వాటికి అనుసంధానమైన ఫోన్ నంబర్లను అపరిచితులకు అందజేస్తున్నారని చెప్పారు. సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న డబ్బును ఈ ఖాతాల్లోకి మళ్లించి వినియోగిస్తున్నట్లు వివరించారు. తెలియని వ్యక్తులకు బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వడం కూడా నేరమేనని హెచ్చరించారు. ప్రజలు అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం కార్డు, ఒకసారి వినియోగించే సంకేత సంఖ్యలు ఇవ్వవద్దని సూచించారు. ఖాతాలో అనుమానాస్పద లావాదేవీలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. బ్యాంకు అధికారులతో సమన్వయం చేసి మ్యూల్ ఖాతాదారుల పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, విచారణను వేగవంతం చేసి మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని కమిషనర్ తెలిపారు.

## 99 రోజుల ప్రణాళికతో పట్టణాభివృద్ధికి కృషి: కమిషనర్ టి.మల్లికార్జున్



హుస్నాబాద్,జనత న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పురపాలక సంఘ కమిషనర్ టి. మల్లికార్జున్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన 99 రోజుల ప్రణాళిక విజయవంతంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో అధికారుల బాధ్యత ఎంతో ఉందని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని ఆయన సూచించారు. వార్డు అధికారులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించే దిశగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమ అమలులో నిర్లక్ష్యం వహించకూడదని, లక్ష్యాలను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇన్చార్జి మేనేజర్ సంపత్ రావు, టౌన్ ప్లానింగ్ అధికారి రోహిత్, సానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, మెప్మా ఏడీఎంసీ సంతోషిమాత, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత గ్రామం అందరి లక్ష్యం

**సర్పంచ్ బోయిని రమేష్**



చిగురుమామిడి,జనత న్యూస్: పర్యావరణాన్ని కాపాడుకుంటూ, గ్రామాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ముదిమాణిక్యం గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ అన్నారు. గురువారం మండలంలోని ముదిమాణిక్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కిరాణ వర్తకులు, చికెన్ సెంటర్ల యజమానులతో లైసెన్స్‌లు, తూనికలు,కొలతలు ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, దుకాణాల వద్ద సేకరించిన ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రత్యేక బుట్టల్లో లేదా కాటన్ డబ్బాల్లో నిల్వ ఉంచాలని సూచించారు. గ్రామ పంచాయతీ చెత్త సేకరణ వాహనం వచ్చినప్పుడు మాత్రమే వాటిని అందజేయాలని కోరారు. ప్లాస్టిక్ కవర్లను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని, డ్రైనేజీలలో ప్లాస్టిక్ వేయడం వల్ల మురుగు నీరు నిలిచి రోగాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై గ్రామ పంచాయతీ తరపున కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చికెన్ సెంటర్ల యజమానులు వ్యర్థ పదార్థాలను చెరువులు, కుంటల్లో పారబోయరాదని సర్పంచ్ ఆదేశించారు. వ్యర్థాలను నిర్మానుష్య ప్రాంతాల్లో లోతైన గుంతలు తీసి, వాసన రాకుండా మట్టితో పూడ్చివేయాలని సూచించారు. 'మన గ్రామం మన పరిశుభ్రత' అనే నినాదంతో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా గ్రామాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

## శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తాం

**మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు పరిశీలించిన నేతలు**



చిగురుమామిడి,జనత న్యూస్:మండలంలోని బొమ్మనపల్లి శివారులోని శిథిలావస్థలో ఉన్న శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంపూర్ణ సహకారం అందిస్తారని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మంత్రి సోదరుడు పొన్నం సత్యం గౌడ్, పులి కృష్ణ తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు గురువారం వారు ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు వారికి ఘనస్వాగతం పలికి సత్కరించారు.

**రూ.50 లక్షల సాయం..**

ఆలయ నిర్మాణం కోసం స్థానిక గౌడ సంఘం నాయకులు, సర్పంచ్ మౌనికతో కలిసి అందుబాటులో ఉన్న సుమారు 5 ఎకరాల స్థలాన్ని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గౌడ సంఘం నుండి రూ.10 లక్షలు డిపాజిట్ చేస్తే, ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయిస్తామని... ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆలయంతో పాటు ఖర్జూర, ఈత, తాటి వనాలను పెంచుకోవాలని, హద్దులను త్వరగా నిర్ణయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంకట మౌనిక, గౌడ సంఘం అధ్యక్షులు వీరగోని విజ్జగిరి, ఉపాధ్యక్షులు తాళ్లపల్లి రాయమల్లు, తాళ్లపల్లి సత్యం, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మాచమల్ల రమణయ్య, వార్డు సభ్యులు, గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com